

RNI NO: APTEL/25/A4894

ఉషశ్రీ

USHASRI తెలుగు దినపత్రిక

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక
సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిస్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377

సంపుటి : 01 | సంచిక : 60 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిళ్ల మోహన్ | ఆదివారం 10 - 05 - 2026 | పేజీలు : 08 | వెల : రూ.2/-

Published From : Visakhapatnam Vijayawada Guntur Tirupati Kurnool Nellore Rajahmundry Kakinada Anantapur Kadapa Eluru Ongole Srikakulam Vizianagaram Machilipatnam Chittoor

అండగా చంద్రబాబు ప్రభుత్వం

జాతీయ, అంతర్జాతీయ విద్యకు పావలా వడ్డీకే రుణాలు

- కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు
- ఆగస్టు 15 నాటికి 2.5 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు
- బుడగజంగాలకు ఎస్సీలకు వర్తించే అన్ని ప్రయోజనాలు వర్తింపు
- సూపర్ సిక్స్, ఇతర సంక్షేమ పథకాల అమలుపై సీఎం సమీక్ష

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ఆంధ్రప్రదేశ్‌లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన విద్యాసంస్థల్లో చదువుకునేందుకు వీలుగా పావలా వడ్డీ (25 పైసల వడ్డీ)కే విద్యా రుణాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఏడవ జిల్లా కలెక్టర్ల సమావేశంలో భాగంగా సంక్షేమ పథకాలపై సమీక్ష సందర్భంగా ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ వంటి జాతీయ సంస్థలతో పాటు విదేశాల్లోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో చదవాలనే విద్యార్థుల కలలు సాకారం కానున్నాయి. కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని, వారికి

మిగతా 2 లో



సిగ్నల్ ఫ్రీ సిటీగా హైద్రాబాద్

త్రీ లెవల్ విధానం తేవాలన్న సీఎం రేవంత్ రెడ్డి

- హైదరాబాద్‌ను సిగ్నల్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దే ప్రణాళిక
- ట్రాఫిక్ నియంత్రణకు త్రీ లెవల్ మోడల్ అమలు
- మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌పై సీఎం రేవంత్ దృష్టి
- పార్కింగ్ సమస్య నివారణకు మల్టీ లెవల్ పార్కింగ్
- తెలంగాణ అభివృద్ధికి క్యూర్, ప్యూర్, రేర్ జోన్లు

మిగతా 2 లో

తెలంగాణ,ఉష శ్రీ : హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ రహిత సిగ్నల్ ఫ్రీ సిటీగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం త్రీ లెవల్ విధానాన్ని అనుసరించనున్నట్లు తెలిపారు. సచివాలయం వేదికగా గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలపై పార్లమెంటరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి.. పలు కీలక విషయాలను వెల్లడించారు. రోడ్ల విస్తరణతోనే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించదని.. దాని కోసం మల్టీ ట్రాన్స్ పోర్ట్ సిస్టమ్ అవసరమని అభిప్రాయపడ్డారు.

పవన్ కళ్యాణ్ ఇంటికి మోదీ

- మోదీ హైదరాబాద్ పర్యటన రేపు రూ.9,400 కోట్ల
- పనులకు శ్రీకారం సింధు ఆస్పత్రిని ప్రారంభించనున్న మోదీ
- పవన్ కళ్యాణ్‌ను పరామర్శించే అవకాశం

మిగతా 2 లో...

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

ప్రధాని మోదీ రేపు హైదరాబాద్ పర్యటనకు వస్తున్నారు. కర్ణాటక నుంచి హైదరాబాద్ చేరుకోనున్న ప్రధాని మోదీ.. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అనంతరం సింధు ఆస్పత్రిని ప్రారంభిస్తారు. ఆ తర్వాత పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. మరోవైపు ప్రధానమంత్రి మోదీ తన హైదరాబాద్ పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శిస్తారంటూ వార్తలు వస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

ప్రధానమంత్రి అభినందనలు

- సువేందు అధికారికి ప్రధాని మోదీ అభినందనలు
- ప్రజల ఆకాంక్షలు అర్థం చేసుకునే నాయకుడని ప్రశంస
- పశ్చిమ బెంగాల్ సీఎంగా సువేందు అధికారి ప్రమాణం
- దిలీప్ ఘోష్‌కు ప్రధాని శుభాకాంక్షలు...
- అగ్నిమిత్ర పాల్ సేవలను. మోదీ ప్రశంసించారు
- కొత్త మంత్రులు అభివృద్ధికి తోడ్పడతారని విశ్వాసం
- ఎక్స్ వేదికగా మోదీ శుభాకాంక్షల సందేశం

పశ్చిమ బెంగాల్ : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ సువేందు అధికారికి ప్రధానమంత్రి అభినందనలు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ సువేందు అధికారికి ప్రధానమంత్రి శ్రీ

వైసీపీ అధినేతనే ఫాలో

ఆంధ్రప్రదేశ్, ఉష శ్రీ

టీవీకే చీఫ్ విజయ్, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మధ్య మరో పోలిక తెచ్చారు మాజీ మంత్రి రోజా. శనివారం రోజున తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకున్నారు రోజా. జాతర సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ విజయ్.. వైఎస్ జగన్‌ను ఫాలో అవుతున్నారని రోజా అన్నారు. తమిళనాడు ఎన్నికల సమయం నుంచి జరుగుతున్న ఘటనలను ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. తమిళనాడులో టీవీకే చీఫ్ విజయ్.. వైసీపీ అధినేత వైఎస్ జగన్ బాటలోనే నడుస్తున్నారంటూ వైసీపీ నేతలు గత కొన్ని రోజులుగా చెప్తున్న సంగతి

తిరుమల శ్రీవారి భక్తులకు

- శ్రీవారి దర్శన టికెట్లు ఆగస్టు నెల కోటా షెడ్యూల్ విడుదల
- ఈ నెల 18 నుంచి ఆర్జిత సేవల కోసం రిజిస్ట్రేషన్ చేస్కోండి
- ఈ నెల 25న రూ.300 దర్శన టికెట్లు విడుదల చేస్తారు

కేరళ సీఎంగా కేసీ వేణుగోపాల్!

- కేరళ సీఎం రేసులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్
- ఎమ్మెల్యేల అభిప్రాయాలను ఖర్గేకు పంపిన పరిశీలకులు
- సతీశన్, చెన్నితాల కూడా పోటీలోనే
- సోమవారం కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం?

జాతీయం, ఉష శ్రీ

కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఘన విజయం సాధించడంతో ముఖ్యమంత్రి ఎంపిక ప్రక్రియ వేగవంతమైంది. సీఎం పదవి కోసం పలువురు నేతలు పోటీ పడుతున్నప్పటికీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆయన సీఎం రేసులో అందరికంటే ముందున్నారని కాంగ్రెస్ వర్గాలు ఎన్డీటీవీకి తెలిపాయి. కేరళలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్

వైసీపీ అధినేతనే ఫాలో

తెలిసిందే. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైనప్పటి నుంచి వైసీపీ శ్రేణులు కూడా ఇదే విషయాన్ని సోషల్ మీడియా ద్వారా పోస్టులు చేస్తూ ఉన్నాయి. ఇక వైఎస్ జగన్ ఫోటో కారణంగా విజయ్ గెలిచాడనే పోస్టులు లేకపోలేదు. ఏపీలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ తరహాలోనే.. తమిళనాడులో టీవీకే చీఫ్ విజయ్ సింగిల్‌గా పోటీ చేసి విజయం సాధించారని మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా అన్నారు. జగన్ తరహాలోనే విజయ్ సింగిల్‌గా బరిలోకి దిగడానికే మొగ్గు చూపారని.. ప్రజలు కూడా విజయ్‌ను ఆశీర్వదించారని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో వైఎస్ జగన్‌తో ఉన్న ఫోటోను విజయ్ బహిరంగంగా ప్రదర్శించారన్న రోజా.. ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉంటూ పక్క రాష్ట్రానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి ఫోటో పట్టుకోవాల్సిన అవసరం ఆయనకు లేదన్నారు. కానీ జగన్, తానూ ఉన్న ఫోటోనూ చూపించడం ద్వారా జగన్ లాంటి నాయకత్వం, పాలన అందిస్తానని విజయ్ చెప్పకనే చెప్పారని రోజా అభిప్రాయపడ్డారు. విజయ్ డ్రెస్సింగ్ కూడా జగన్ మాదిరిగానే ఉంటుందని.. డ్రెస్ కోడ్ విషయంలోనూ విజయ్ జగన్‌ను ఫాలో అవుతున్నారని అన్నారు. డ్రెస్సింగ్, బహిరంగ సభలలో మాట్లాడే తీరును గమనిస్తే విజయ్.. జగన్‌ను అనుసరిస్తున్న విషయం అందరికీ తెలుస్తుందన్నారు మాజీ మంత్రి రోజా.

విజయ్, జగన్‌ను ఫాలో అవుతున్నారు: రోజా : తమిళనాడు ప్రజలు విజయ్ ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నారని.. కావున గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇచ్చి, అసెంబ్లీలో బలనిరూపణకు అవకాశమిస్తే బాగుంటుందని రోజా అభిప్రాయపడ్డారు. మరోవైపు తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిని రోజా శనివారం దర్శించుకున్నారు. గంగమ్మ జాతర సందర్భంగా గంగమ్మను దర్శించుకుని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ రాజకీయాలతో పాటుగా తమిళ రాజకీయాలపై రోజా స్పందించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏపీలో ఎవరి బలం ఏమిటో తెలుస్తుందన్నారు రోజా. వైసీపీ వైపు ప్రజలు ఉన్నారనే సంగతి అర్థమవుతుందన్నారు.

తిరుమల శ్రీవారి భక్తులకు

ఆంధ్రప్రదేశ్, : టీటీడీ ఆగస్టు నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి దర్శనాలు, ఆర్జిత సేవలు, గదుల కోటా విడుదలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 18 నుంచి ఆర్జిత సేవల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ నెల 25న రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు విడుదల చేయనుంది. తిరుమల శ్రీవారి భక్తులు ఈ షెడ్యూల్‌ను గమనించి బుక్ చేసుకోవాలని టీటీడీ సూచించింది. తిరుమల తిరుమల శ్రీవారిని దర్శించుకునే భక్తుల కోసం టీటీడీ దర్శనం టికెట్లు, ఆర్జిత సేవలు, వసతి గదుల్ని ఆన్‌లైన్‌లో రెండు నెలలు ముందుగానే విడుదల చేస్తోంది. టీటీడీ తాజాగా ఆగస్టు నెలకు సంబంధించిన ఆన్‌లైన్ కోటా షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నెల 18న ఉదయం 10 గంటలకు.. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆగస్టు నెలకు సంబంధించిన టికెట్లను విడుదల చేయనుంది. భక్తులు ఈ ఆర్జిత సేవలకు సంబంధించి టికెట్ల రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఈ నెల 20 నుంచి 22 తేదీ మధ్యాహ్నం వరకు ఈ టికెట్లు పొందిన వారు డబ్బులు చెల్లిస్తే టికెట్లు మంజూరవుతాయి. ఈ నెల 21న ఉదయం 10 గంటలకు తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలైన కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమలలో 23-08-26 నుంచి 25-08-26 వరకు నిర్వహించే వార్షిక పవిత్రోత్సవాల టికెట్లను మే 21 ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. అదే రోజు (మే 23న) ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు. ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తుంది. ఈ నెల 25న ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు.. అదే రోజు (మే 25న) తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారని తెలిపారు. తిరుమల శ్రీవారి భక్తులు ఆర్జితసేవలు, దర్శన టికెట్లు టీటీడీ అఫిషియల్ వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.ఱఱ ద్వారా బుక్ చేసుకోవాలని కోరింది.

ప్రధానమంత్రి అభినందనలు

నరేంద్ర మోదీ నేడు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజలతో మమేకమై, వారి ఆకాంక్షలను క్షుణ్ణంగా అర్థం చేసుకునే నాయకుడిగా శ్రీ సువేందు అధికారి తనదైన ముద్ర వేశారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. రాబోయే పదవీ కాలం విజయవంతంగా సాగాలని శ్రీ మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ దిలీప్ ఘోష్, శ్రీమతి అగ్నిమిత్ర పాల్, శ్రీ అశోక్ కీర్తనియా, శ్రీ క్షుదీరామ్ తుడు, శ్రీ నిశిత్ ప్రమాణిక్‌లకు కూడా అభినందనలు తెలియాజేశారు. ఈ నాయకులు క్షేత్రస్థాయిలో అవిశ్రాంతంగా శ్రమిస్తూ ప్రజలకు సేవలందించాలని శ్రీ మోదీ అన్నారు. మంత్రులుగా వీరు పశ్చిమ బెంగాల్ అభివృద్ధి ప్రయాణాన్ని మరింత బలోపేతం చేస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ... వారికి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి ఈ విధంగా పేర్కొన్నారు. "పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ సువేందు అధికారికి అభినందనలు. ప్రజలతో మమేకమై, వారి ఆకాంక్షలను దగ్గర నుంచి అర్థం చేసుకునే నాయకుడిగా ఆయన తనదైన ముద్ర వేశారు. ఆయన పదవీ కాలం విజయవంతంగా సాగాలని నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను". "పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంలో మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన దిలీప్ ఘోష్ గారు, అగ్నిమిత్ర పాల్ గారు, అశోక్ కీర్తనియా గారు, క్షుదీరామ్ తుడు గారు, నిశిత్ ప్రమాణిక్ గారికి నా అభినందనలు. ఈ నాయకులు క్షేత్రస్థాయిలో అలుపెరుగక శ్రమిస్తూ ప్రజలకు సేవలందించారు. మంత్రులుగా వీరు పశ్చిమ బెంగాల్ అభివృద్ధి ప్రయాణాన్ని మరింత బలోపేతం చేస్తారన్న నమ్మకం నాకుంది. వీరికి నా శుభాకాంక్షలు".

అండగా చంద్రబాబు ప్రభుత్వం

ముఖ్యమంత్రి చంద్రబాబు విస్తృతంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' ద్వారా 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు అందిస్తున్నామని, 'స్త్రీశక్తి' పథకం కింద మహిళలు ఇప్పటివరకు 60.6 కోట్ల ప్రయాణాలు చేశారని, దీనికోసం ప్రభుత్వం ఏటా రూ.1940 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. 'దీపం 2.0' కింద 1.08 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.3504 కోట్లు అందజేశామన్నారు. మే 19న మత్స్యకారుల కోసం రూ.286 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

బుడగజంగాలకు ఎస్సీ ప్రయోజనాలు: సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. బుడగజంగాలను ఎస్సీలలో చేర్చాలన్న డిమాండ్‌పై కేంద్రంతో చర్చిస్తామని, కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తించే అన్ని సంక్షేమ ప్రయోజనాలను వారికి వర్తింపజేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇది వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది.

సంక్షేమ పథకాలపై సమీక్ష, కీలక ఆదేశాలు: సూపర్ సిక్స్ పథకాల అమలు, లబ్ధిదారుల ఇంటిగ్రేషన్‌పై అవసరమైన శిక్షణ ఇచ్చి ప్రఖ్యాత సంస్థల్లో సీట్లు సాధించేలా చూడాలని సూచించారు. విదేశాల్లో ఉద్యోగాలు సాధించేందుకు వీలుగా ఎస్సీ, ఎస్టీ యువతకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని, యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా వారి జీవన ప్రమాణాలను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.

పేదల సొంతింటి కల సాకారం: రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందని సీఎం తెలిపారు. ఆగస్టు 15 నాటికి 2.50 లక్షల ఇళ్లకు, డిసెంబర్ నాటికి మరో 2.38 లక్షల ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలని, దీనివల్ల ఒక్క విజయవాడలోనే 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ధి చేకూరుతుందని అన్నారు.

పరిపాలనలో పారదర్శకత, వేగం: ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేలా అధికారులు పనిచేయాలని సీఎం సూచించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, విద్యుత్ ఖర్చులు తగ్గించేలా చొరవ చూపాలన్నారు. భూవివాదాలను పరిష్కరించడంలో భాగంగా వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి 22ఏ కింద ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 2027 మార్చి నాటికి భూ రీసర్వే ప్రక్రియ పూర్తి చేసి, పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ల సమావేశాలు, సమీక్షలు కేవలం ప్రజల సంక్షేమం కోసమేనని, ప్రతి అధికారి ఈ విషయాన్ని గుర్తుంచుకుని పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

సిగ్నల్ ఫ్రీ సిటీగా హెచ్వైడీ

రోజురోజుకూ విస్తరిస్తున్న నగరం, పెరుగుతున్న జనాభా, అలాగే పెరుగుతున్న వ్యక్తిగత వాహనాల సంఖ్య కారణంగా హైదరాబాద్‌ను ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. మాములు రోజులలో పోలిస్తే.. వర్షకాలంలో ఈ సమస్య మరింత జఠిలంగా మారుతోంది. వర్షం పడితే చాలు.. రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌ను సిగ్నల్ ఫ్రీ సిటీగా మార్చేందుకు తెలంగాణ సర్కారు చర్యలు చేపడుతోంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నగరాన్ని సిగ్నల్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దుతామన్న సీఎం రేవంత్ రెడ్డి.. అండర్‌పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవల్ మోడల్ తీసుకురావాలని సూచించారు. రహదారుల విస్తరణతోనే ట్రాఫిక్ నియంత్రణ సాధ్యం కాదన్న ముఖ్యమంత్రి.. ఇందుకోసం మల్టీ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ అభివృద్ధి చేయాలన్నారు. అందులో భాగంగానే మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాలపై సచివాలయంలో వేదికగా పార్లమెంటరీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఆధునీకరణ, పట్టణీకరణ కారణంగా భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కొనాల్సి వస్తుందని అంచనా వేశారు. పెరుగుతున్న పట్టణ జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ మహానగరాన్ని ట్రాఫిక్ రహిత, పార్కింగ్ సమస్య రహిత, పొల్యూషన్ రహిత నగరంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని జఖ=జు, ్రాఖ=జు, =ూ=జు అనే మూడు జోన్లుగా వర్గీకరించి, అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వివరించారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానించబోతున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, పలువురు ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్యూర్, ప్యూర్, రేర్ అంటే : 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ -2047లో భాగంగా ఈ త్రిముఖ వ్యూహాన్ని ప్రతిపాదించింది. క్యూర్ కింద.. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ప్రాంతాన్ని కాలుష్య రహితంగా మార్చి, ఐటీ, సర్వీస్ సెక్టార్ హబ్‌గా మార్చాలని ఉద్దేశం. ఇందులో భాగంగానే మూసీ రివర్ డెవలప్‌మెంట్, మెట్రో విస్తరణ, హైదరాబాద్‌ను సిగ్నల్ ఫ్రీ సిటీగా మార్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ప్యూర్ కింద.. ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఇండస్ట్రియల్ జోన్‌గా అభివృద్ధి చేస్తారు. ఇక రేర్ కింద.. రీజినల్ రింగ్ రోడ్డు నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న ప్రాంతంలో.. వ్యవసాయ, ఆహార ప్రాసెసింగ్ రంగాలను ప్రోత్సహిస్తారు.

కేరళ సీఎంగా కేసీ వేణుగోపాల్!

ఎమ్మెల్యేలతో ఏఐసీసీ పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్ సమావేశమై వారి అభిప్రాయాలు స్వీకరించారు. అనంతరం శుక్రవారం ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు తమ నివేదికను సమర్పించారు. అత్యధిక మంది ఎమ్మెల్యేలు వేణుగోపాల్ వైపే మొగ్గు చూపినట్లు సమాచారం. ఈ ఎన్నికల్లో యూడీఎఫ్ గెలుపునకు 'నిజమైన సూత్రధారి' వేణుగోపాల్ అని అభివర్ణిస్తూ కార్యకర్తలు 'నాయకన్' (హీరో) పోస్టర్లను ప్రదర్శిస్తున్నారు. సీఎం రేసులో ప్రస్తుత ప్రతిపక్ష నేత వీడీ సతీశన్, సీనియర్ నేత రమేశ్ చెన్నితాల పేర్లు కూడా ఉన్నప్పటికీ, పార్టీ అధిష్ఠానం వేణుగోపాల్ వైపే మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. మొత్తం 140 స్థానాలున్న కేరళ అసెంబ్లీలో యూడీఎఫ్ కూటమి 102 సీట్లు గెలుచుకుంది. ఇందులో కాంగ్రెస్ 63, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ 22, కేరళ కాంగ్రెస్ 7 స్థానాలు సాధించాయి. పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కేవలం 35 సీట్లకే పరిమితమైంది. అధిష్ఠానం పిలుపు మేరకు ముగ్గురు ప్రధాన నేతలు ఢిల్లీకి వెళ్లనున్నారు. ఒకవేళ ముఖ్యమంత్రిగా ఎంపికైతే, ప్రస్తుతం ఆలప్పుళ లోక్‌సభ ఎంపీగా ఉన్న వేణుగోపాల్ తన పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. కొత్త ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం జరిగే అవకాశం ఉండగా, ఈ కార్యక్రమానికి రాహుల్ గాంధీ హాజరుకావచ్చని భావిస్తున్నారు.

పవన్ కళ్యాణ్ ఇంటికి మోదీ

ఆదివారం హైదరాబాద్ పర్యటనకు రానున్నారు. ప్రధానమంత్రిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణకు మోదీ రావటం ఇదే తొలిసారి. ప్రధానమంత్రి మోదీ తన హైదరాబాద్ పర్యటనలో రూ.9,400 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. మరోవైపు నరేంద్ర మోదీ తన హైదరాబాద్ పర్యటనలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలుస్తారంటూ వార్తలు వస్తున్నాయి. పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు మోదీ పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శిస్తారని వార్తలు వస్తున్నాయి. ఇదే సమయంలో చిరంజీవి కూడా అక్కడకు వస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల 20 నిమిషాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. కర్ణాటక నుంచి బేగంపేట్ఎ యిర్?పోర్టుకు చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గంలో హెచ్ఐసీసీ వద్దకు చేరుకుంటారు. అక్కడ వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం హైటెక్ సిటీ వెళ్లనున్న ప్రధాని.. అక్కడ సింధు హాస్పిటల్ ప్రారంభిస్తారు. ఆ తర్వాత బేగంపేట్ ఎయిర్‌పోర్టు వద్దకు చేరుకుని పార్టీ నేతలతో భేటీ అవుతారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పరేడ్ గ్రౌండ్ చేరుకుని సభలో పాల్గొంటారు. మరోవైపు హైదరాబాద్ పర్యటన గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. రేపు (మే 10) కర్ణాటక, తెలంగాణలో వివిధ కార్యక్రమాలకు హాజరు కానున్నట్లు తెలిపారు. రేపు ఉదయం 11 గంటలకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ 45వ వార్షికోత్సవానికి హాజరు కానున్నట్లు తెలిపారు. మధ్యాహ్నానికి హైదరాబాద్ చేరుకుని 9500 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం సింధు ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొని.. జాతికి అంకితం చేయనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం హైదరాబాద్‌లో జరిగే బీజేపీ సభకు హాజరవుతానని.. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రశ్నించనున్నట్లు మోదీ ట్వీట్ చేశారు.

హోంగార్డు కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం

విజయవాడ, కమిషనరేట్ (ఉషశ్రీ) 9: విధి నిర్వహణలో ఉండగా అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు జె. రమేష్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజ శేఖర బాబు అందజేశారు. విజయవాడ నగర హోంగార్డులు స్వచ్ఛందంగా తమ వేతనాల నుంచి నిధులు సమకూర్చి మరణించిన లేదా పదవీ విరమణ చేసిన హోంగార్డులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. హోంగార్డు (హెచ్.జి. నెం.812) జె. రమేష్ గతంలో విజయవాడ నగర హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఈ ఏడాది మార్చి 13న మరణించారు. ఆయన కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ.5 లక్షల చెక్కును శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రమేష్ పెద్దన్న జె. ఆంజనేయ ప్రసాద్‌కు కమిషనర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ కె. సుధాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషి తో మహిళలు, బాలల భద్రత

విజయవాడ, కమిషనరేట్ (ఉషశ్రీ) మే 9 : మహిళలు, బాలల భద్రతతో పాటు మానవ హక్కుల పరిరక్షణ లక్ష్యంగా, ప్రతి అధికారి సమిష్టి కృషి మహిళా, శిశు భద్రత విభాగ ఐజీ బి. రాజ కుమారి అన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజ శేఖర బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాజ కుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరి కేసుల దర్యాప్తులో అనుసరించాల్సిన విధివిధానాలు, బాధితుల రక్షణ, నిందితులకు శిక్ష పడేలా సాక్ష్యాల సేకరణపై ఐజేఎం ప్రతినిధులు పోలీసు అధికారులకు అవగాహన కల్పించారు. పోక్సో చట్టాల అమలు, డిజిటల్ ఆధారాల గుర్తింపు, చైన్ ఆఫ్ కస్టడీ నిర్వహణపై స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గెడ్డం రాజేశ్వర రావు వివరించారు. ఈ సందర్భంగా ఐజీ బి.రాజ కుమారి మాట్లాడుతూ మిస్సింగ్ కేసుల నుంచే హ్యూమన్ ట్రాఫికింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంతో విచారించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ రాజ శేఖర బాబు మాట్లాడుతూ టెక్నాలజీ వినియోగంతో దర్యాప్తు వేగవంతమై, కచ్చితమైన సాక్ష్యాల ఆధారంగా నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ కె.జి.వి. సరిత, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బృందాలు, శక్తి బృందాల సభ్యులు పాల్గొన్నారు.

పూడికలు తొలగింపు

గుంటూరు, ఉషశ్రీ: ప్రత్తిపాడు గ్రామ పంచాయతీలో మురుగు కాల్వలలో ప్రతి రోజు పూడికలు తీయడం జరుగుతోందని జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ శనివారం తెలిపారు. ఆయన స్పందిస్తూ పాతమల్లయపాలెం సెంటర్ లో ఉన్న మురుగు కాల్వలో వ్యర్థాలు తొలగించుట జరిగిందన్నారు. ప్రస్తుతము ఆయా కాలువల్లో నీరు ప్రవహిస్తుందని చెప్పారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న సైడు కాలవలను ఆక్రమించిన దుకాణ దారులకు తొలగించ వలసినదిగా నోటీసులు జారీచేయడం జరిగిందని వివరించారు.

సి.యం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

గుంటూరు, ఉషశ్రీ: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 13వ తేదీన మంగళగిరి మండలం నిడమర్రు గ్రామంలో పర్యటించనున్న దృష్ట్యా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ ఎ.భార్గవ తేజ, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ తో కలసి జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి వచ్చే మార్గం, ప్రజలు వచ్చే మార్గం వాటి పరిస్థితులు పరిశీలించారు. ఏర్పాట్లలో ఎటువంటి లోటు పాటు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కే శ్రీనివాసరావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గంటా రమణయ్య ఆధ్వర్యంలో ఘనంగా దద్దాల ముందస్తు జన్మదిన వేడుకలు

ఉష శ్రీ : పామూరు మండలం, చట్టమడుగు గ్రామంలో వైఎస్సార్సీపీ నాయకులు గంటా రమణయ్య ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.లి ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువ, పూలదండ తో ఘనంగా సన్మానించి,కేక్ కటింగ్ చేసి ఒకరికి ఒకరు ఆప్యాయంగా తినిపించుకున్నారు.. ఈ కార్యక్రమం లో గంగసాని హుస్సేన్ రెడ్డి,మడతల కస్తూరి రెడ్డి,కల్లూరి రామిరెడ్డి,గట్ల విజయభాస్కర్ రెడ్డి,గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి,పోలక సిద్ధారెడ్డి, తుపాకుల ఆంజనేయ రెడ్డి,చింతలపూడి మల్లికార్జున రెడ్డి,మితికాల బాలకృష్ణ,జొన్నలగడ్డ ప్రహల్లాద, తేలుకుట్ల శ్రీనివాసులు,రుద్రపాటి మాచర్ల,కుమ్మరి కుంట ఎఖు, సంకే మాల్యాద్రి, నడవ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు...

జిల్లాను అగ్రగామిగా నిలపాలి

వినూత్న కార్య క్రమాలను ఆలోచించాలి

గుంటూరు, ఉషశ్రీ: జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అన్ని శాఖల అధికారులు తమ వంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాలను రాష్ట్రంలోనే మొదటి ఐదు స్థానాలలో ఉండేలా కృషి చేయాలన్నారు. ప్రధానంగా కీ పెర్ఫార్మన్స్ ఇండికేటర్, ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో అందిన అర్జీలు శత శాతం పరిష్కారం, కేటాయించిన బడ్జెట్ వంరిగిపోకుండా చూడాలని పేర్కొన్నారు. గత రెండు రోజులుగా జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్యాలను వివరించారు. పీఎం సూర్య ఘర్, పీఎం కుసుం పథకాలను అనుసంధానం చేసి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయాలన్నారు. నిర్దేశిత సమయానికి నివేదికలు అందేలా చూడాలన్నారు. జిల్లాలో వినూత్నంగా చేపట్టకు అవకాశం ఉన్న కార్యక్రమాలను గూర్చి ఆలోచించాలని, సంబంధిత ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. తేనె, అగరబత్తి, మిల్లెట్స్ ,హ్యాండ్లూమ్స్, ఇ – కామర్స్ ప్లాట్ఫారంలపై ఎలా బిజినెస్ చేయవచ్చు ఆలోచించాలన్నారు. అంగన్వాడీ సెంటర్లకు డ్రింకింగ్ వాటర్ ను, టాయిలెట్లను 15 రోజులలో ఏర్పాటు చేయాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. స్కూల్లో డ్రాప్ అవుట్ లు లేకుండా చూడాలని, మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. జిల్లా అధికారులు తమ కార్యాలయంలోని కోర్టు కేసులకు బాధ్యత గల అధికారిని నియమించాలని, నిర్ణీత సమయంలో కౌంటర్ ఫైల్ చేసేలా చూడాలన్నారు. ఎల్ నినో ప్రభావం వలన ఈ సంవత్సరము వర్షాలు తక్కువగా కురిసే అవకాశాలు ఉన్నాయని, రైతులు వర్షపాతం తక్కువగా ఉంటే ఏ పంటలు వేసుకోవాలో వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేయాలన్నారు. ఇప్పటి నుండే నీటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. పని చేయటమే కాదు .. చేసిన పనులను ప్రజలకు తెలియ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, రెవెన్యూ డివిజన్ అధికారి కే శ్రీనివాసరావు ,డిప్యూటీ కలెక్టర్లు, గంగరాజు, తెనాలి ఇన్ ఛార్జ్ సబ్ కలెక్టర్ లక్ష్మీ కుమారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు

ఏపీలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ 24 గంటల్లోనే పూర్తి..

ఆ తర్వాత ఆటోమేటిక్‌గా, కొత్త రూల్ వస్తోంది

గుంటూరు, ఉషశ్రీ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ కోసం రోజుల తరబడి వేచి ఉండే పనిలేకుండా 24 గంటల్లోనే పూర్తి చేసేలా కొత్త విధానాన్ని తీసుకువస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం.. ఎవరైనా కొత్తగా వాహనం కొనుగోలు చేస్తే డీలర్ తాత్కాలిక (టెంపరరీ) రిజిస్ట్రేషన్ చేస్తారు.. ఆ తర్వాత రవాణాశాఖ ఆమోదం తెలిపితే పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ విధానంలో ప్రజలు రోజుల తరబడి వేచి చూడాల్సి పరిస్థితి ఎదురవుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ అంశంపై అధికారులతో చర్చించారు. రాబోయే రోజుల్లో వాహనాల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఆలస్యం లేకుండా వాహనదారులకు వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం అధికారుల్ని ఆదేశించారు. వెంటనే రంగంలోకి దిగిన రవాణాశాఖ 24 గంటల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసేలా కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. ఏపీ ప్రభుత్వం వారం రోజుల్లో ఆమోదిస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 27 వేల వాహనాల వరకు రవాణాశాఖ అధికారుల దగ్గర పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కోసం పెండింగ్‌లో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి నిర్ణీత గడువు లేకపోవడమే దీనికి కారణం అంటున్నారు. ఏపీ ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త విధానం అమల్లోకి వస్తే.. రవాణాశాఖ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కేవలం 24 గంటల్లోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. డీలర్ దగ్గర వాహనాలు కొనుగోలు చేసిన తర్వాత టెంపరరీ రిజిస్ట్రేషన్ చేస్తారు.. ఆ తర్వాత ఫ్యాన్సీ నంబరు కోసం దరఖాస్తు చేసుకున్నవారు మినహా మిగిలిన అందరి వాహనాల రిజిస్ట్రేషన్ అప్లికేషన్‌లను.. రవాణాశాఖ అధికారులు 24 గంటల్లో పరిశీలించి ఆమోదించాల్సిందే. పర్మినెంట్ (శాత్వత) రిజిస్ట్రేషన్ ప్రక్రియ, నంబర్ జనరేట్ చేయడం గడువులోపే పూర్తి చేయాల్సిందే. ఒకవేళ 24 గంటల్లోపు అధికారులు ఈ ప్రక్రియను పూర్తి చేయకపోతే ఆ వెంటనే ఆటోమెటిక్‌గా (24 గంటల తర్వాత) రిజిస్ట్రేషన్‌కు ఆమోదం లభిస్తుంది. ఒకవేళ సెలవు రోజులు ఉంటే.. ఆ రోజు కూడా ఆన్‌లైన్‌లో అధికారులు ఆమోదం తెలిపే అవకాశం కల్పిస్తారు. అలాగే వాహన డీలర్‌క తాత్కాలిక రిజిస్ట్రేషన్‌తో పాటుగా శాశ్వత రిజిస్ట్రేషన్ అధికారాన్ని అప్పగించే అంశాన్ని ముందు పరిశీలించారు. ఇలా చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని.. ఆ శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి అధికారం రవాణాశాఖ అధికారుల దగ్గర మాత్రమే ఉండాలని అధికారులు తేల్చి చెప్పారు. ఆ తర్వాత 24 గంటల్లో రిజిస్ట్రేషన్ పూర్తిచేసే ప్రతిపాదనల్ని ప్రభుత్వానికి పంపారు.. అక్కడ నుంచి ఆమోదం రాగానే 24 గంటల్లో రిజిస్ట్రేషన్ పూర్తిచేసేలా కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు.

పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం.

- జనసేనలో బాలినేనికి కీలక బాధ్యతలు
- సీమతో పాటు నెల్లూరు, ప్రకాశం కూడా

గుంటూరు, ఉషశ్రీ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలక బాధ్యతలు అప్పగించారు. డీ లిమిటేషన్ ప్రక్రియతో పాటుగా ఏపీలో త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కమిటీలను ఏర్పాటు చేసింది. మొత్తం 11 మంది సభ్యులతో మూడు కమిటీలను ఏర్పాటు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. సభ్యులకు తాజాగా జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి రాయలసీమ జిల్లాలైన ఉమ్మడి అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలతో పాటుగా.. ప్రకాశం, నెల్లూరు జిల్లాల బాధ్యతలు అప్పగించింది. పవన్ కళ్యాణ్ ఆదేశాలత బాలినేని శ్రీనివాసరెడ్డి రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో పర్యటించనున్నారు. ఆయా జిల్లాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు. డీలిమిటేషన్ అంశాలపై చర్చిస్తారు. అనంతరం ఈ పర్యటన వివరాలతో సమగ్ర నివేదికను పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు సమర్పించనున్నారు. అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల కోసం ఏర్పాటు చేసిన కమిటీలో బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటుగా ఆరణి శ్రీనివాసులు, టీసీ వరుణ్‌కు స్థానం కల్పించారు. అలాగే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల కోసం కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, సీహెచ్ వంశీకృష్ణలతో కమిటీ ఏర్పాటైంది. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల కోసం పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాస్, కొటికలపూడి గోవిందరావులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇక కృష్ణా, గుంటూరు జిల్లాల

బాధ్యతలను నాదెండ్ల మనోహర్, సామినేని ఉదయభానులకు అప్పగించారు.

11న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

విజయవాడ, (ఉషశ్రీ)మే 9 : జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఈ నెల 11న ఎనికేపాడులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో ఆర్‌టీఐహెచ్--స్టార్టప్ ఎక్స్‌పో నిర్వహించనున్నామని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలు, వినూత్న ఆలోచనలతో ముందుకు వస్తున్న స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందించేందుకు ఈ ఎక్స్‌పోను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ జోన్ పరిధిలోని స్టార్టప్‌లు ఇందులో పాల్గొని తమ ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నమూనాలను ప్రత్యేక స్టాళ్ల ద్వారా ప్రదర్శించవచ్చన్నారు. ఉత్తమ స్టార్టప్‌లకు నగదు బహుమతులు కూడా అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలుగా, రెండో బహుమతి రూ.20 వేలుగా, మూడో బహుమతి రూ.15 వేలుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. సాంకేతిక రంగంలో ప్రతిభ కనబరుస్తున్న యువత, స్టార్టప్ వ్యవస్థాపకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం 9154970454 నంబర్‌ను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

రోజూకు 30 నిమిషాలు పుస్తకాన్ని చదవండి

అక్లేమ్డ్ బయోగ్రాఫర్, రీడింగ్ కోచ్ రీటా రామమూర్తి గుప్త

గుంటూరు,ఉషశ్రీ: విజ్ఞాన్ యూనివర్సిటీలో ఘనంగా 'ఉద్భవ్యా' మూడవ సిరీస్ చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ఉద్భవ్యా ఇగ్నైటింగ్ విజ్డమ్, ఇన్‌స్పైరింగ్ చేంజ్' అనే కార్యక్రమ సిరీస్‌లో భాగంగా మూడవ చాప్టర్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ అదర్ ఫారిన్ లాంగ్వేజెస్, మరియు ఆఫీస్ ఆఫ్ ది డీన్ స్టూడెంట్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా, రీడిస్కవరింగ్ ఏ ఫర్‌గాట్టన్ హీర్ ఆఫ్ ఇండియన్ హిస్టరీ" అనే పేరుతో ప్రారంభమైన మూడవ చాప్టర్‌లో అక్లేమ్డ్ బయోగ్రాఫర్, రీడింగ్ కోచ్ రీటా రామమూర్తి గుప్త, ఇంద్రజీత్ ఘోర్పాడే కలిసి సంయుక్తంగా రచించిన " మురారిరావ్ ఘోర్పాడే : ద యాక్సిడెంటల్ కెటలిస్ట్ బిహైండ్ రాబర్ట్ క్లైవ్స్ మార్చ్ ఓవర్ ఇండియా" అనే పుస్తకాన్ని విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ లావు శ్రీకృష్ణదేవరాయలు ఆవిష్కరించారు. ఈ సిరీస్‌లో భాగంగా వివిధ రంగాలకు చెందిన ప్రతిష్ఠాత్మక వ్యక్తులు తమ అనుభవాలు, ఆలోచనలు విద్యార్థులతో పంచుకునే అవకాశం లభించనుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అక్లేమ్డ్ బయోగ్రాఫర్, రీడింగ్ కోచ్ రీటా రామమూర్తి గుప్త మాట్లాడుతూ విద్యార్థులు రోజువారీ జీవితంలో పుస్తక పఠనాన్ని భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి రోజుకు కనీసం 30 నిమిషాల పాటు తమకు నచ్చిన పుస్తకాన్ని చదివే అలవాటు పెంపొందించుకోవాలని తెలిపారు. మొదట్లో ఎక్కువసేపు ఏకాగ్రత సాధ్యం కాకపోతే 5 నుంచి 6 నిమిషాల పాటు చదవడం ప్రారంభించి, ఆ సమయాన్ని క్రమంగా పెంచుకుంటూ వెళ్లాలని సూచించారు. పఠనం వ్యక్తిత్వ వికాసానికి, ఆలోచనా శక్తి పెంపుకు, జ్ఞాన విస్తరణకు దోహదపడుతుందని వివరించారు. అలాగే విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలని, తమ నైపుణ్యాలను అప్‌డేట్ చేసుకుంటూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న ఈ కాలంలో నిరంతర అధ్యయనం, పఠనం మరియు పరిశోధనాత్మక దృక్పథం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆవిష్కరించిన "మురారిరావ్ ఘోర్పాడే" పుస్తకం భారత చరిత్రలో విస్మరించబడిన మరాఠా యోధుడు మురారిరావ్ ఘోర్పాడే జీవితం, నాయకత్వం, రాజకీయ వ్యూహాలు మరియు రాబర్ట్ క్లైవ్ కాలం నాటి చారిత్రక పరిణామాలపై విశ్లేషణాత్మకంగా వెలుగులోకి తీసుకువచ్చిన గ్రంథమని తెలిపారు. భారత చరిత్రలో మరుగున పడిన అంశాలను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఎక్కువగా తమ వ్యక్తిగత లక్ష్యాలు, ఉద్యోగాలు, సాంకేతిక విద్యపైనే దృష్టి కేంద్రీకరిస్తోందని, కానీ సమాజాన్ని తీర్చిదిద్దిన మహనీయుల చరిత్ర, దేశ సంస్కృతి, రాజ్యాల పరిపాలన వంటి అంశాలపై కూడా అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం మన గురించి మాత్రమే ఆలోచిస్తే సరిపోదు. మన దేశ చరిత్ర, మన పూర్వీకుల గొప్పతనం, గత తరాల పోరాటాలు తెలుసుకున్నప్పుడే వ్యక్తిత్వం సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. చరిత్ర అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాదని, అది సమాజ నిర్మాణానికి మార్గదర్శకమని తెలిపారు. భారతదేశం అనేక సామ్రాజ్యాలు, సంస్కృతులు, యోధులు, త్యాగాలతో నిర్మితమైన మహత్తర దేశమని, ఆ చరిత్రను అర్థం చేసుకోకుండా జీవితంలో గొప్ప విజయాలు సాధించడం కష్టమని వ్యాఖ్యానించారు. విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీల్లో ముందంజలో నిలవాలంటే తమ మూలాలను, భారతీయతను, చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మరాఠా సామ్రాజ్య చరిత్రను ప్రస్తావిస్తూ, దక్షిణ భారతదేశంలో మరాఠా రాజులు తెలుగు ప్రజలతో కలిసిమెలిసి పాలన సాగించిన విధానాన్ని వివరించారు. వివిధ భాషలు, సంస్కృతులు ఉన్నప్పటికీ పరస్పర గౌరవంతో పరిపాలన కొనసాగించారని చెప్పారు. మరాఠా పాలకులు తెలుగు ప్రాంతాలతో ఏర్పరచుకున్న సాంస్కృతిక, రాజకీయ, సామాజిక సంబంధాలు భారతదేశ సమైక్యతకు నిదర్శనమని తెలిపారు. అలాగే చరిత్రలో మరుగునపడిన వీరుల కథలను వెలుగులోకి తీసుకురావడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మురారిరావ్ ఘోర్పాడే" వంటి గ్రంథాలు యువతకు చరిత్రపై కొత్త దృక్పథాన్ని అందిస్తాయని కొనియాడారు. విద్యార్థులు కేవలం సిలబస్‌కు మాత్రమే పరిమితం కాకుండా చరిత్ర, సాహిత్యం, జీవిత చరిత్రలు, నాయకత్వ పాఠాలు తెలిపే పుస్తకాలను చదవాలని సూచించారు. అలాంటి పఠనం వ్యక్తిత్వ వికాసానికి, నాయకత్వ లక్షణాల పెంపుకు, సమాజంపై అవగాహన పెరగడానికి దోహదపడుతుందని అన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. తదనంతరం ప్రధాన అతిథిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

గుంటూరు, ఉషశ్రీ : తాను ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకుడిని కాను.. ప్రజల సమస్యలు వినడానికి, వారి కష్టాల్లో తోడుండేందుకు నిరంతరం అందుబాటులో ఉండే సేవకుడిని.." అని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు స్పష్టం చేశారు. శనివారం నరసరావుపేట షాదీఖానాలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సామూహిక ఉచిత ఖత్నా మహోత్సవానికి పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబుతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ముస్లిం సోదరులను ఉద్దేశించి ప్రసంగించారు. ముస్లిం సోదరులు కోరిన విధంగా సద్భావన భవనాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. అలాగే ఆటో నగర్ అభివృద్ధి కోసం కేవలం షెడ్లకే పరిమితం కాకుండా, కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో లేటెస్ట్ మెషినరీతో కూడిన 'కామన్ ఫెసిలిటీ సెంటర్'ను ఏర్పాటు చేస్తామన్నారు. దీనికోసం మెకానిక్ సోదరులు ముందుకు వస్తే పూర్తి బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. అత్యాధునిక పనిముట్లు అందుబాటులో ఉంటే శ్రమ తగ్గడమే కాదు.. ఆర్థికంగా మంచి లాభం చేకూరుతుందని వారికి తెలియజేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నరసరావుపేటకు కేంద్రీయ విద్యాలయాన్ని తీసుకువచ్చామని, ఈ ఏడాది నుండే అడ్మిషన్ల ప్రక్రియ మొదలవ్వబోతుందని.. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో నిలిచిపోయిన ఐటిఐ కాలేజీ అభివృద్ధి పథంలో పెట్టి.. అవసరమైన సిబ్బంది నియామకానికి చొరవ చూపుతున్నామని, ఈ ఏడాది నుండి క్లాసులు ప్రారంభిస్తున్నామని తెలిపారు. అదే సమయంలో విద్య యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, పిల్లలను, ముఖ్యంగా ఆడపిల్లలను కేవలం పదో తరగతితో ఆపేయకుండా ఉన్నత చదువులు చదివించాలని, ప్రభుత్వం ఇచ్చే తల్లికి వందనం, ఫీజు రీయంబర్స్మెంట్ పథకాలను ఉపయోగించుకుని వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అందుకు ఎంతో మంది డాక్టర్లుగా, ఇంజనీర్లుగా స్థిరపడిన తురక పాలెంను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో ముస్లిం జనాభా అవసరాల దృష్ట్యా ఆరు నుంచి ఏడు కమ్యూనిటీ హాల్స్ నిర్మించడానికి సిద్ధంగా ఉన్నామని, ముస్లిం సోదరులు అందుకు కావలసిన స్థలం సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

మహిళలు ఆర్థికంగా

ఎదగాలిఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ,(ఉషశ్రీ), మే 9: యువత, స్వయం సహాయక సంఘాల మహిళలు స్టార్టప్‌ల ద్వారా ఆర్థికంగా ఎదగాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన వ్యాపారాలు సమర్థవంతమైన ప్రణాళిక, నాణ్యత, మార్కెటింగ్‌తో పెద్ద పరిశ్రమల స్థాయికి ఎదగగలవని అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్లో అర్బన్ జిల్లా సమాఖ్య, ఫౌండర్స్ రూఫ్, వివిధ స్టార్టప్‌ల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళల భద్రత, స్మార్ట్ వెహికల్ మేనేజ్‌మెంట్, ప్రోటీన్ ఇన్ఫ్యూజ్డ్ కాఫీ, డీహైడ్రేషన్, ఎకో ఫ్రెండ్లీ టెక్నాలజీ తదితర రంగాల్లో స్టార్టప్‌లు ప్రారంభించిన యువతతో కలెక్టర్ సమాలోచనలు నిర్వహించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా, ఈ-కామర్స్ వేదికలను వినియోగించుకోవడం ద్వారా స్థానిక ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను డిజిటల్ మార్కెటింగ్ ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లవచ్చన్నారు. ప్రభుత్వ శిక్షణలు, ఆర్థిక సహాయం, ప్రోత్సాహక పథకాలను వినియోగించుకుని యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అర్బన్ సమాఖ్య అధ్యక్షురాలు కె. మీనాక్షి, ఎస్‌హెచ్‌జీ పారిశ్రామికవేత్తలు వాణి, మాధురి, కృష్ణవేణి, ఫౌండర్స్ రూఫ్ ప్రతినిధులు విష్ణు, జగదీష్, స్టార్టప్ వ్యవస్థాపకులు ఉజ్వల్ బొర్రా, విఠల్, సతీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాయిల్డ్ రైస్ కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి

రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విజయవాడ,(ఉషశ్రీ)మే 9 : రాష్ట్రంలో తొలిసారిగా బాయిల్డ్ రైస్ కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఈ ప్రకటన రైతులకు పెద్ద ఊరట లభించిందని రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో 2 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. శనివారం ఎన్టీఆర్ జిల్లాలోని రామవరప్పాడు, గొల్లపూడి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన మంత్రి, తేమ శాతం పరీక్షించే విధానాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యం అమ్మిన తర్వాత 30 నిమిషాల నుంచి 17 గంటల వ్యవధిలోనే డబ్బులు ఖాతాల్లో జమ అవుతున్నాయని రైతులు తెలిపారు. గోతాల్లో రంధ్రాలు, లారీల కొరత వంటి సమస్యలను గుర్తించి, వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 17.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయిందన్నారు. రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.4,410 కోట్లు జమ చేశామని, అందులో 94 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే పూర్తయ్యాయని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో గత ఏడాది 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, ఈసారి ఇప్పటికే 80 వేల మెట్రిక్ టన్నుల సేకరణ జరిగిందని, ఇది 60 శాతం కంటే ఎక్కువ పెరుగుదల అని పేర్కొన్నారు. ఇతర జిల్లాల మిల్లర్లను కూడా ధాన్యం కొనుగోళ్లలో భాగస్వామ్యం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ తదితర అధికారులు పాల్గొన్నారు.

సమాధన్ సమరో సుప్రీం కోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్

గుంటూరు, ఉషశ్రీ: సమాధన్ సమరో 2026 లో భాగంగా సుప్రీం కోర్టులో ఆగష్టు 21,22,23 తేదీలలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ లోక్ అదాలత్ సుప్రీం కోర్టులోనే నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సుప్రీం కోర్టులో పెండింగ్ లో ఉన్న కేసులు లోక్ అదాలత్ లో సెటిల్ చేసుకోవాలని తెలిపారు. పెండింలో ఉన్న కేసులు ప్రమాదాలకు సంబంధించి క్లయింలు, చెక్ బౌన్స్ కేసులు, భూ సేకరణ సమస్యలు లోక్ అదాలత్ లో సెటిల్ చేసుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ ఫారాలు, సుప్రీం కోర్టు వెబ్ సైట్లోను, జిల్లా కోర్టు వెబ్ సైట్ లోను అందుబాటులో ఉంచామన్నారు. ఫిర్యాదు దారులు, కక్షిదారులు సుప్రీం కోర్టు అంగీకారంతో వారి న్యాయవాదులతో జిల్లాలోనే హాజరు కావచ్చునని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించే సెటిల్మెంట్ సమావేశాలకు ప్రత్యక్షంగా లేదా వర్చువల్ గా హాజరు కావొచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నంబరు, 15100, 0863-222448 లను సంప్రదించవచ్చునని తెలిపారు.

వన్ టౌన్ లో టాక్టికల్ అర్బనిజం

విజయవాడ, (ఉషశ్రీ) మే 9: టాక్టికల్ అర్బనిజంలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తున్న క్రమంలో భాగంగా శనివారం పోలీసులు కాళేశ్వరరావు మార్కెట్ పరిసరాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీ షీరిన్ బేగం సూచనలతో వన్ ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, పశ్చిమ ఏసీపీ దుర్గారావు పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టారు. కాళేశ్వరరావు మార్కెట్ వద్ద పండ్లు, ఇతర వస్తువులు విక్రయిస్తున్న చిరు వ్యాపారులకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి రోడ్డుపై అడ్డదిడ్డంగా వ్యాపారం చేయవద్దని సూచించారు. ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉన్న వస్తువులను తొలగించారు. ఆటో డ్రైవర్లకు కూడా ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఆపకుండా రోడ్డుకు పక్కగా నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పించారు. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ ప్రత్యేక డ్రైవ్ వల్ల ట్రాఫిక్ నియంత్రణలోకి రావడంతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెరిగిందని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు సత్యనారాయణ, ఓంకార్, ఆర్ఎస్ఐ శ్రీధర్ తదితర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్లను రికవరీ పోలీస్ కమిషనరేట్ రాష్ట్రంలో రెండో స్థానం

విజయవాడ, కమిషనరేట్(ఉషశ్రీ) మే 9 : పోయిన, దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు తిరిగి అందించడంలో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజ శేఖర బాబు ప్రశంసాపత్రం అందుకున్నారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు జజ×= (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) సేవలను వినియోగించి పోయిన లేదా దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందిస్తున్నారు. ఈ సేవల అమలులో ఎన్టీఆర్ కమిషనరేట్ రాష్ట్రంలోనే రెండో స్థానాన్ని సాధించింది. డీజీపీ కార్యాలయంలో మే 8న నిర్వహించిన కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ అధికారులతో కలిసి డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈ అవార్డును పోలీస్ కమిషనర్ రాజ శేఖర బాబుకు అందజేసి అభినందించారు. అనంతరం విజయవాడలోని కమిషనర్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ డీసీపీ కృష్ణ ప్రసన్న కు కమిషనర్ అభినందనలు తెలిపారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజ శేఖర బాబు

విజయవాడ,(ఉషశ్రీ)మే 9 : మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజ శేఖర బాబు హెచ్చరించారు. ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 71 మంది వాహనదారులను కోర్టులో హాజరుపరచగా, వారిలో ఆరుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం పర్యవేక్షణలో వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు.

పలువురికి శిక్షలు జరిమానాలు: ఈ క్రమంలో 2వ, 3వ, 4వ, 6వ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 71 మంది పట్టుబడ్డారు. వీరిలో ఆరుగురికి ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు శిక్ష విధించగా, మరో 65 మందికి మొత్తం రూ.6.50 లక్షల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని నగర పోలీసు అధికారులు సూచించారు.

క్రీడా స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం రొంపిచర్ల విద్యార్థులు

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

గుంటూరు,ఉషశ్రీ: నరసరావుపేట నియోజకవర్గంలో క్రీడా వెలుగులు విరజిమ్మిన సంఘటన చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి నరసరావుపేట శాసనసభ్యుల కార్యాలయం ఆనందోత్సాహాలతో నిండిపోయింది. 70వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బేస్ బాల్ చాంపియన్షిప్‌లో విజయకేతనం ఎగురవేసిన రొంపిచర్ల జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్వయంగా అభినందించడం. బేస్ బాల్ వంటి క్రీడలో రాష్ట్రస్థాయిలో నిలవడం చిన్న విషయం కాదు. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే సౌకర్యాలు తక్కువగా ఉండే గ్రామీణ పాఠశాల నుంచి వచ్చిన ఈ చిన్నారులు తమ పట్టుదల, క్రమశిక్షణతో విజయాన్ని సాధించారు. వీరి గెలుపు కేవలం ఒక ట్రోఫీ కాదు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభకు నిదర్శనం అని ఎమ్మెల్యే అన్నారు. విజేతలను తన కార్యాలయానికి ఆహ్వానించి శాలువాలతో సత్కరించిన డాక్టర్ అరవింద బాబు చదువుతో పాటు క్రీడలు కూడా జీవితంలో భాగం కావాలని అన్నారు. మీరు నియోజకవర్గం పేరును రాష్ట్రస్థాయిలో నిలబెట్టారు. రేపు దేశం తరపున ఆడాలి అని ఆయన విద్యార్థులతో అన్నారు. క్రీడాకారులకు కావాల్సిన కిట్లు, శిక్షణకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేసిన మాటలు నేటి తరానికి అవసరం. మొబైల్ ఫోన్లు, టీవీలకు పరిమితం అవుతున్న బాల్యాన్ని మైదానం వైపు మళ్లించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. క్రీడలు శారీరక దారుఢ్యాన్నే కాదు, జట్టు స్ఫూర్తిని, నాయకత్వ లక్షణాలను, ఓటమిని స్వీకరించే గుణాన్ని నేర్పుతాయి. రొంపిచర్ల విద్యార్థుల విజయం మిగతా పాఠశాలలకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. ఈ సందర్భంగా 70వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బేస్ బాల్ చాంపియన్షిప్ విజేతలను అభినందించారు.

క్రమశిక్షణ గల జీవితానికి తొలిమెట్టు టెన్త్ క్లాస్ : ఏఎస్ఐ అరుణ కుమారి

శ్రీకాకుళం, ఉష శ్రీ మే9: క్రమశిక్షణ గల జీవితానికి తొలిమెట్టు టెన్త్ క్లాస్ అని ఏఎస్ఐ అరుణకుమారి పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం శక్తి బృందంతో కలిసి 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ అరుణ కుమారి మాట్లాడుతూ మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి యాప్ ద్వారా ,112,1930,181,1090,1972 ఎస్ఓఎస్ బటన్ ద్వారా ఫిర్యాదు చేయవ చ్చునన్నారు. మహిళలకు ఆపద సమయంలో అత్యవసర సాయం అందించేందుకు శక్తియాప్ ఒక ఆయుధంగా పనిచేస్తుందన్నారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి క్రమశిక్షణ గల జీవన విధానం అలవర్చుకోవాలని పదవ తరగతి ఇంటర్మీడియట్ భవిష్యత్తును తీర్చిదిద్దుకునేందుకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. ఆ దిశగా తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మాటలను శ్రద్ధగా విని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు. క్రమశిక్షణ గల పౌరుడిగా దేశానికి సమాజానికి సేవ చేసే లక్షణాలు అలవర్చుకోవాలన్నారు.

శ్రీరామ వారి వివాహ వేడుకలో పాల్గొన్న దద్దాల, గంగసాని

ఉష శ్రీ పామూరు : స్థానిక పువ్వాడి రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్ లో జరిగిన వైఎస్సార్సీపీ కనిగిరి నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రీరామ శ్రీనివాసులు – విజయలక్ష్మి దంపతులకుమారుడు కళ్యాణ్,మమత ల వివాహ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకలకువైయస్ఆర్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మండల పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వివాహ శు భాకాంక్షలు తెలిపారు ఈ వేడుకలో గంగసాని హుస్సేన్ రెడ్డి, గంగసాని లక్ష్మి,మడతల కస్తూరి రెడ్డి,కల్లూరి రామిరెడ్డి, షేక్ చాంద్ భాష,గట్ల విజయభాస్కర్ రెడ్డి, షేక్ గయాజ్, జొన్నలగడ్డ గోవిందయ్య,పోలక సిద్ధారెడ్డి,షేక్ రసూల్,మితికల బాలకృష్ణ,తుపాకుల ఆంజనేయులు రెడ్డి, చింతలపూడి మల్లికార్జున రెడ్డి,,మార్తాల శివారెడ్డి, ముడియాల అనంతరెడ్డి, ఉడుముల మధుసూదన్ రెడ్డి,మర్రి రాజు, రాచకొండ మహేంద్ర,జొన్నలగడ్డ ప్రహల్లాద్, మూలే కోటిరెడ్డి, పోలేపల్లి సిద్దయ్య, దేవల్ల గురుస్వామి,హరీష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి తిరునాళ్ల కు కదిరి బాబురావు 75 వేలు విరాళం

ఉష శ్రీ: కనిగిరి పట్టణం లోని కొత్తూరులో ఈ నెల 12వ తేదీన జరిగే హనుమాన్ జయంతి తిరునాళ్ళ మహోత్సవానికి కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు 75 వేలు రూపాయలు విరాళాన్ని శనివారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తమ్మనేని శ్రీరామ్ రెడ్డి ,ఎమ్ శ్రీహరిరెడ్డి,ఆప్టా వ్యవస్థాపక అధ్యక్షులు చందు శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్ షేక్ ఫయాజ్,కదిరి రమణయ్య,రహిమాన్,ముత్యాల ప్రతాప్, సాయి, తదితరులు ఉన్నారు.

జిల్లెళ్ళ ఆదినారాయణ ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

ఉష శ్రీ: సి ఎస్ పురం మండలం కోవిలంపాడు గ్రామానికి చెందిన జిల్లెళ్ళ ఆదినారాయణ అనారోగ్యం కారణంగా వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు .కనిగిరి మాజీ ఎమ్మెల్యే ,విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు నివాస గృహానికి వెళ్లి పరామర్శించారు .ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకొని వేసవి కాలం దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు మునగల వెంకట నారాయణ రెడ్డి ,నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి ,గోను చంద్రశేఖర్ రెడ్డి ,దాసరి నారాయణస్వామి ,జిల్లెళ్ళ విష్ణు నారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు .

గవర్నర్ వ్యవస్థను రాజకీయ ఆయుధంగా మార్చారు

గుంటూరు,ఉషశ్రీ: భారత రాజ్యాంగం గవర్నర్ పదవిని ఒక తటస్థ, రాజ్యాంగ సంస్థగా ఏర్పాటు చేసింది. సమాఖ్య వ్యవస్థలో కేంద్ర–రాష్ట్రాల మధ్య వారధిగా రాజ్యాంగ విలువల సంరక్షకుడిగా ఆయన పాత్ర నిర్వహించాలి. కానీ గత దశాబ్దంలో ముఖ్యంగా ఒకే పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు, గవర్నర్ కార్యాలయం రాజకీయ వివాదాల కేంద్రంగా మారింది. ఇది ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకాన్ని కొంతవరకు దెబ్బతీస్తోంది.

చారిత్రక వాస్తవాలు: 2018 కర్ణాటక ఎన్నికల్లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించినా పూర్తి మెజార్టీ లేకపోవడంతో గవర్నర్ వాజూభాయ్ వాలా బీజేపీ నాయకుడు బి.ఎస్. యడియూరప్పను ముందుగా ఆహ్వానించారు. కాంగ్రెస్–జేడీఎస్ కూటమి స్పష్టమైన మెజార్టీని చూపించినప్పటికీ సుప్రీం కోర్టు జోక్యంతో త్వరిత ఫ్లోర్ టెస్ట్ జరిగి యడియూరప్ప రాజీనామా చేశారు. తర్వాత కొద్ది నెలల్లోనే కూటమి ప్రభుత్వం కూలిపోయి బీజేపీ అధికారంలోకి వచ్చింది. 2020 మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కాలంలో జ్యోతిరాదిత్య సింధియా అనుచరుల రాజీనామాలు, ఆపరేషన్ లోటస్ ఆరోపణలు రాజకీయ చర్చనీయాంశ మయ్యాయి. గవర్నర్ ఫ్లోర్ టెస్ట్ ఆదేశించడం సుప్రీం కోర్టు పరిధిలో ఉంటూ కూడా తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. మహారాష్ట్ర 2019–2022 సంక్షోభంలో గవర్నర్ భగత్ సింగ్ కోష్యారి చర్యలపై సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. గవర్నర్ చర్యలు ప్రభుత్వ పతనానికి దారి తీయకూడదు అని స్పష్టం చేసింది. గోవా (2017), మణిపూర్ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా ఉన్నా బీజేపీకి అవకాశం ఇవ్వడం వివాదాస్పదమైంది. ఈ ఉదాహరణలు ఒక్క పార్టీకి మాత్రమే పరిమితం కావు. గతంలో కాంగ్రెస్ కాలంలో కూడా గవర్నర్లు వివాదాల్లో చిక్కుకున్న సందర్భాలు ఉన్నాయి. కానీ ఇటీవలి సంవత్సరాల్లో వీటి తీవ్రత పెరిగింది.

తమిళనాడు తాజా పరిణామాలు: 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం టి వి కె 108 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. 234 సీట్ల అసెంబ్లీకి 118 మెజార్టీ అవసరం కావడంతో ప్రభుత్వ ఏర్పాటు అనిశ్చితి నెలకొంది. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ పాత్రపై ప్రతిపక్షాలు, ఎఖ విమర్శలు చేస్తున్నాయి. అతిపెద్ద పార్టీ నాయకుడిని ముందుగా ఆహ్వానించి ఫ్లోర్ టెస్ట్ ఇవ్వాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. కపిల్ సిబల్ వంటి నాయకులు గవర్నర్లు ఏజెంట్లలా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఇక్కడ ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే అతిపెద్ద పార్టీకి సహజంగా అవకాశం ఇవ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమా? లేదా కూటములు, మద్దతు ఆధారంగా స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలా? సుప్రీం కోర్టు తీర్పులు ఫ్లోర్ టెస్ట్‌ను ఆమోదించినా గవర్నర్ వ్యక్తిగత వివేకానికి పరిమితులు ఉన్నాయని స్పష్టం చేశాయి.

ప్రజాస్వామ్యానికి సవాలు: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించడం ప్రజాస్వామ్యం భాద్యత. ఎన్నికల్లో గెలవలేకపోతే ఆపరేషన్ లోటస్ ద్వారా అధికారం అనే ట్రెండ్ ప్రజాస్వామ్య నైతికతకు విరుద్ధం. గవర్నర్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం సమాఖ్య వ్యవస్థను బలహీనపరుస్తుంది. రాజ్యాంగ నిపుణులు, సుప్రీం కోర్టు పలుమార్లు గవర్నర్ తటస్థతను నొక్కి చెప్పినా ఆచరణలో అది సవాలుగా మిగిలిపోతోంది. గవర్నర్ల నియామకం, పదవీ కాలం, అధికారాల వినియోగం వంటి అంశాలపై సుదీర్ఘ చర్చ, సంస్కరణలు అవసరం. గవర్నర్ రాజ్యాంగ పరిరక్షకుడిగా మిగిలితేనే సమాఖ్య స్ఫూర్తి నిలుస్తుంది. ప్రజాస్వామ్యం కేవలం అధికార పోరాటం కాదు. రాజ్యాంగ విలువలు, సంస్థల సమగ్రతను కాపాడే బాధ్యత. అన్ని రాజకీయ పార్టీలు ఈ బాధ్యతను గుర్తించి, గవర్నర్ సంస్థను రాజకీయ ఆయుధంగా కాకుండా రాజ్యాంగ సంస్థగా కాపాడాలి. లేనిపక్షంలో ప్రజల విశ్వాసం దెబ్బతినడం దేశ భవిష్యత్తుకే ముప్పు.

భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాసు-పుస్తకాలు అందజేత : కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

ఎ.కొండూరు, (ఉషశ్రీ), మే 9 : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అత్యాధునిక సాంకేతికత, భద్రతా ఫీచర్లతో రూపొందించిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తోందని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాటిలైట్ టెక్నాలజీ, జియో కోర్డ్స్ అనుసంధానంతో భూముల రీసర్వే నిర్వహించి తెలిపారు. భూ యాజమాన్య వ్యవస్థలో పారదర్శకత పెంచుతూ, భూ వివాదాలకు చెక్ పెట్టేలా ఈ కొత్త విధానం ఉపయోగపడుతుందని చెప్పారు. శనివారం ఎ.కొండూరు మండలం మాధవరంలో నిర్వహించిన కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తో కలిసి 702 మంది లబ్ధిదారులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ రాజముద్రతో కొత్త పాసుపుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా భూమి వివరాలను మొబైల్, కంప్యూటర్‌లలో పరిశీలించవచ్చని చెప్పారు. భూ హద్దులు మార్చడం వంటి మోసాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించేందుకు ఈ సెక్యూరిటీ ఫీచర్లు ఉపయోగపడతాయని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి, ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టి లాభదాయక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఎ.కొండూరు ప్రాంతాన్ని అగ్రి, హార్టీ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. 22ఏలో ఉన్న ప్రైవేట్ భూములను తొలగించి యజమానులకు పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డీవో ఎ. కుమార్, తహసీల్దార్ ఎం. ఉదయ భాస్కరరావు, ఎంపీడీవో బొజ్జగాని శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా 90 వసంతాల ఆకాశవాణి వేడుకల కార్యక్రమం

- నేడు తుమ్మలపల్లి కళా క్షత్రంలో స్వర సంధ్య మ్యూజికల్ కార్యక్రమం
- విశ్వసనీయతకు మారుపేరు ఆకాశవాణి – నేటి తరానికీ స్ఫూర్తిదాయకం....

అమరావతి మే 9 ఉష శ్రీ : ఆకాశవాణి 90 వసంతాల సందర్భంగా ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్ జైన్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారని అందులో భాగంగా ఆకాశవాణి రీజినల్ ఛానెల్ మేనేజర్ బి. సోమేశ్వరరావు, ఆకాశవాణి కార్యక్రమ విభాగాధిపతి జి. దివ్య, న్యూస్ విభాగాధిపతి టి. హెన్రీ రాజ్ లు శనివారం ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రీజినల్ ఛానెల్ మేనేజర్ ఎం. సోమేశ్వరరావు మాట్లాడుతూ ... తొమ్మిది దశాబ్దాలుగా ఆకాశవాణి విజయవాడ కేంద్రం సమాజంలోని ప్రతి వర్గానికి చేరువవుతూ విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. కళాకారులకు నిలయంగా, రైతులకు నేస్తంగా, యువతకు స్నేహితుడిగా నిలుస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. ఈ కేంద్రం ద్వారా ఎం.బాలమురళీకృష్ణ, కె.విశ్వనాథ్, గొల్లపూడి మారుతీరావు, కొంగర జగ్గయ్య వంటి దిగ్గజాలు తమ ప్రయాణాన్ని సాగించారన్నారు. విద్య, వ్యవసాయం, సాహిత్యం, సంగీత, సాంస్కృతిక రంగాల్లో విజ్ఞానదాయకమైన కార్యక్రమాలను ప్రసారం చేస్తూ ఈ కేంద్రం అగ్రగామిగా నిలుస్తోందన్నారు. ఆకాశవాణి కేవలం వార్తలకే పరిమితం కాకుండా కథలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలను వినూత్న రీతిలో ప్రజలకు అందిస్తోందన్నారు. పాత తరం నుండి నేటి తరం వరకు అందరికీ చేరువయ్యేలా తన ప్రసార పద్ధతులను మార్చుకుంటూ, ప్రస్తుతం డిజిటల్ మోడ్‌లో కూడా ప్రసారాలను కొనసాగిస్తోంది. భారతదేశంలో సుమారు 585 స్టేషన్లతో, 92.5% ప్రజలకు మరియు 99.17% భౌగోళిక ప్రాంతానికి ఆకాశవాణి తన సేవలను విస్తరించిందన్నారు. ఆకాశవాణి అందించే వార్తలు అత్యంత వాస్తవమైనవని, నమ్మదగినవిగా గుర్తింపు పొందాయన్నారు. 1936లో మొదటి రేడియో స్టేషన్ ప్రారంభమైందని ఎమ్. సోమేశ్వరరావు పేర్కొన్నారు. ప్రోగ్రామ్ విభాగాధిపతి గుడుపూడి దివ్య మాట్లాడుతూ... ప్రస్తుతం ఆకాశవాణి 90వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. డైరెక్టర్ జనరల్ శ్రీ రాజీవ్ కుమార్ జైన్ ఆదేశాల మేరకు, జూన్ 8, 2025 నుండి జూన్ 8, 2026 వరకు ఏడాది పొడవునా వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మే 10 (ఆదివారం) సాయంత్రం 6 గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సర్వేపల్లి సిస్టర్స్ గాత్ర కచేరీ, గరగ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు మే 10న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బహుమతులు అందిస్తామన్నారు. మే 19 ఉదయం 6:30 గంటలకు నగరంలో ప్రత్యేక వాకథాన్ నిర్వహిస్తున్నామన్నారు. వాస్తవమైన వార్తలకు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారానికి ఆకాశవాణి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందన్నారు. ప్రస్తుతం యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల్లోనూ కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆకాశవాణి న్యూస్ విభాగాధిపతి హెన్రీ రాజ్ మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో సమాచార విప్లవం ఎన్ని మలుపులు తిరిగినా, ఆకాశవాణి (ూశ్రీశ్రీ ×అ౨ఱ్ఱు ౫ఱ౨శ్రీ) తన విశ్వసనీయతను, ప్రామాణికతను కాపాడుకుంటూనే ఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియా, టీవీ ఛానళ్ల హడావిడిలో నేటి తరానికి ఆకాశవాణి విశిష్టతపై అవగాహన తగ్గుతోందని, దాని ప్రాముఖ్యతను చాటిచెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన కోరారు. ఒకప్పుడు గడియారాల్లో సమయాన్ని సరిచేసుకోవడానికి ఆకాశవాణి సమయాన్నే అందరూ ప్రామాణికంగా భావించేవారని, ఆ సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. టీఆర్పీ (ఠ్రా) రేటింగ్‌ల కోసం కాకుండా, అత్యంత జెన్యూన్‌గా, వాస్తవ ఆధారిత వార్తలను అందించడమే ఆకాశవాణి ప్రత్యేకతన్నారు. ప్రస్తుత కాలంలో రేడియో సెట్లు అందుబాటులో లేకపోయినా, న్యూస్ ఎయిర్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ల ద్వారా ప్రపంచంలో ఎక్కడి నుంచైనా వార్తలు, చర్చా కార్యక్రమాలు వినవచ్చన్నారు. ఆకాశవాణి సంకేతాలు అంతర్జాతీయ స్థాయిలో యూరప్ దేశాల్లో అందుతున్నాయని, ఇటీవల బెల్జియం నుండి వచ్చిన స్పందనే దీనికి నిదర్శనమని హెన్రీ రాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆకాశవాణి రీజినల్ ఛానెల్ మేనేజర్ బి. సోమేశ్వరరావు, ఆకాశవాణి కార్యక్రమ విభాగాధిపతి జి. దివ్య, న్యూస్ విభాగాధిపతి టి. హెన్రీ రాజ్ లు స్వర సంధ్య (కల్చరల్ కార్యక్రమాల) పోస్టర్ ను ఆవిష్కరించారు.

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI

జామ తో ఆరోగ్యం

రోగనిరోధక శక్తిని పెంచే సహజ ఔషధం



జామ పండులో దాగి ఉన్న పోషక శక్తి
విటమిన్ సి నిల్వగా జామ రోగనిరోధక శక్తిని పెంచే సహజ ఔషధం
మధుమేహ నియంత్రణలో జామ పాత్ర.....
గుండె ఆరోగ్యానికి మేలు చేసే గుణాలు
జీర్ణక్రియకు జామ చేసే సహాయం
చర్మం, జుట్టు ఆరోగ్యానికి జామ ప్రయోజనం
పిల్లలు, వృద్ధులకు సమానంగా ఉపయోగకరం
జామ ఆకుల ఆరోగ్య రహస్యాలు
ప్రతిరోజూ జామ తింటే కలిగే మార్పులు

జామ పండు మన దేశంలో దాదాపు ప్రతి ప్రాంతంలో కనిపించే సాధారణ పండు. కానీ ఈ సాధారణ పండులో దాగి ఉన్న ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం అసాధారణమైనవి. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే పండ్లలో జామకు ప్రత్యేక స్థానం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణాల్లోనూ అందరికీ అందుబాటులో ఉండే ఈ పండు ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోంది. చాలా మంది ఆపిల్, కివి, డ్రాగన్ ఫ్రూట్ వంటి ఖరీదైన పండ్లను ఆరోగ్యానికి మంచివిగా భావిస్తారు. అయితే జామ పండులో ఉండే పోషకాలు అనేక ఖరీదైన పండ్లకంటే ఎక్కువగా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

జామ పండులో ముఖ్యంగా విటమిన్ జ సమృద్ధిగా ఉంటుంది. సాధారణంగా నారింజలో విటమిన్ జ ఎక్కువగా ఉంటుందని అనుకుంటారు. కానీ జామలో నారింజకంటే ఎక్కువ మోతాదులో విటమిన్ జ ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. వాతావరణ మార్పుల సమయంలో జలుబు, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి సమయంలో జామ పండును ఆహారంలో చేర్చడం ద్వారా శరీరానికి సహజ రక్షణ లభిస్తుంది.

జామలో ఫైబర్ కూడా అధికంగా ఉంటుంది. ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం సమస్యతో బాధపడేవారికి జామ చాలా ఉపయోగకరం. ఉదయం లేదా సాయంత్రం సమయంలో జామ తినడం వల్ల కడుపు శుభ్రంగా ఉండటమే కాకుండా జీర్ణవ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. ప్రస్తుతం ఫాస్ట్ ఫుడ్ అలవాట్ల వల్ల జీర్ణ సమస్యలు ఎక్కువవుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో సహజ ఆహారంగా జామ మంచి పరిష్కారంగా మారుతోంది.

మధుమేహంతో బాధపడుతున్నవారికి కూడా జామ మంచి పండు. ఇందులో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా సహాయపడుతుంది. జామలో ఉండే ఫైబర్ రక్తంలో చక్కెర శోషణను నెమ్మదిగా చేస్తుంది. అందువల్ల వైద్యులు కూడా మధుమేహ రోగులకు పరిమిత మోతాదులో జామ తినాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా తొక్కతో కలిపి తింటే మరింత ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు.

గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా జామ పాత్ర ఎంతో ఉంది. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచే గుణాలు కూడా జామలో ఉన్నాయి. గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్న ఈ కాలంలో సహజమైన ఆహారపు అలవాట్లు ఎంతో అవసరం. ప్రతిరోజూ ఒక జామ పండు తినడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చు.

జామ పండు చర్మ సౌందర్యానికి కూడా మేలు చేస్తుంది. ఇందులో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా ఉంచుతాయి. వయసు పెరిగే కొద్దీ వచ్చే ముడతలను తగ్గించడంలో సహాయపడతాయి. జామలో ఉండే విటమిన్-ూ, విటమిన్ జ చర్మ కణాలను రక్షిస్తాయి. చాలా మంది ఖరీదైన క్రీములు, ఫేషియల్స్ కోసం డబ్బులు ఖర్చు చేస్తుంటారు. కానీ సహజంగా ఆరోగ్యకరమైన చర్మం కోసం జామ వంటి పండ్లను ఆహారంలో చేర్చడం ఎంతో మేలు చేస్తుంది.

జుట్టు ఆరోగ్యానికి కూడా జామ ఉపయోగపడుతుంది. జుట్టు రాలడం, బలహీనత వంటి సమస్యలను తగ్గించడంలో జామలో ఉండే పోషకాలు సహాయపడతాయి. ముఖ్యంగా విటమిన్ జ కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి జుట్టు వేర్లను బలపరుస్తుంది. అలాగే జామ ఆకులను మరిగించి ఆ నీటితో తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యంగా ఉంటుందని పాతకాలం నుంచి ప్రజలు నమ్ముతున్నారు.

జామ పండులో తక్కువ కేలరీలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి ఆహారం. ఆకలి ఎక్కువగా వేయకుండా నియంత్రిస్తుంది. ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల జంక్ ఫుడ్ తినాలనే కోరిక తగ్గుతుంది. ప్రస్తుతం ఊబకాయం సమస్య యువతలో ఎక్కువగా కనిపిస్తోంది. అలాంటి వారికి సహజ ఆహారంగా జామ మంచి ఎంపికగా మారుతోంది.

పిల్లల ఎదుగుదలలో కూడా జామ ఉపయోగకరం. ఇందులో ఉండే విటమిన్లు, ఖనిజాలు శరీర ఎదుగుదలకు సహాయపడతాయి. పిల్లలకు తరచూ బయట దొరికే ప్యాకెట్ ఫుడ్స్ ఇవ్వడం కంటే జామ వంటి పండ్లు ఇవ్వడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఇది శరీరానికి శక్తిని ఇవ్వటమే కాకుండా మెదడు పనితీరును కూడా మెరుగుపరుస్తుంది.

వృద్ధులకు కూడా జామ చాలా మంచిది. వయసు పెరిగేకొద్దీ జీర్ణ సమస్యలు, రోగనిరోధక శక్తి తగ్గడం వంటి సమస్యలు వస్తాయి. అలాంటి సమయంలో జామ తినడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు లభిస్తాయి. అయితే పళ్ల సమస్యలు ఉన్నవారు మృదువైన జామను తీసుకోవడం మంచిది.

జామ ఆకులు కూడా ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. జామ ఆకులతో చేసిన టీ ప్రస్తుతం ఆరోగ్య పానీయంగా ప్రాచుర్యం పొందుతోంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా బరువు నియంత్రణలో కూడా సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి గాయాలు, చర్మ సమస్యలకు జామ ఆకులను ఉపయోగించే పద్ధతి ఇప్పటికీ కనిపిస్తుంది.

జామలో ఐరన్ కూడా కొంతమేర ఉంటుంది. రక్తహీనత సమస్యతో బాధపడేవారికి ఇది కొంతవరకు సహాయపడుతుంది. ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత ఎక్కువగా కనిపించే పరిస్థితుల్లో పోషకాహారం ఎంతో అవసరం. జామ వంటి సహజ పండ్లు శరీరానికి శక్తినిస్తూ ఆరోగ్యాన్ని కాపాడతాయి. ప్రస్తుతం కాలుష్యం, ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో సహజమైన పండ్లు తీసుకోవడం ఎంతో అవసరం. జామ పండు అందులో ముందుంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం అందించే ఈ పండు ప్రతి ఇంటిలో భాగం కావాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పండ్లను తినే సరైన విధానం కూడా ముఖ్యమే. జామను బాగా కడిగి తొక్కతో కలిపి తింటే ఎక్కువ ప్రయోజనం లభిస్తుంది. ఎందుకంటే తొక్కలోనే ఎక్కువ ఫైబర్ ఉంటుంది. అయితే అధికంగా తినడం వల్ల కొందరికి జీర్ణ సమస్యలు రావచ్చు. అందువల్ల పరిమిత మోతాదులో తీసుకోవడం మంచిది.

జామను పచ్చిగా మాత్రమే కాకుండా జ్యూస్, సలాడ్, చాట్ రూపంలో కూడా తీసుకోవచ్చు. మార్కెట్‌లో జామతో తయారయ్యే పానీయాలు, జామ్‌లు, క్యాండీలు కూడా లభిస్తున్నాయి. అయితే సహజ రూపంలో తినడం వల్లనే పూర్తి పోషకాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

గ్రామీణ రైతులకు కూడా జామ సాగు లాభదాయకంగా మారుతోంది. తక్కువ నీటితో పెరిగే ఈ చెట్లు రైతులకు ఆదాయం అందిస్తున్నాయి. ప్రస్తుతం ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న కొద్దీ జామకు మార్కెట్‌లో డిమాండ్ కూడా పెరుగుతోంది. స్థానిక పండ్లకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల రైతులకు కూడా మేలు జరుగుతుంది.

చాలా మంది ఖరీదైన సప్లిమెంట్లు, విటమిన్ మాత్రలపై ఆధారపడుతున్నారు. కానీ సహజంగా పోషకాలు అందించే పండ్లు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. జామ అలాంటి సహజ ఆరోగ్య రక్షకుడిగా నిలుస్తోంది. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఆహారంలో జామను చేర్చుకోవడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. వైద్యులు చెబుతున్నదేమిటంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఖరీదైన ఆహారాలు అవసరం లేదు. సరైన ఆహారపు అలవాట్లు ఉంటే చాలనేది వారి అభిప్రాయం. జామ వంటి స్థానిక పండ్లు శరీరానికి కావలసిన పోషకాలను అందిస్తాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉండే ఈ పండ్లను నిర్లక్ష్యం చేయకుండా ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. రోజూ ఒక జామ తినే అలవాటు చేసుకుంటే శరీరానికి సహజ రక్షణ లభిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. చర్మం కాంతివంతంగా మారుతుంది. గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇలా అనేక ప్రయోజనాలు కలిగించే జామ నిజంగా ప్రకృతి ఇచ్చిన వరమని చెప్పాలి.

ఉష శ్రీ స్పెషల్

ప్రకృతి ఇచ్చిన ఆరోగ్య భద్రత

- సహజ ఆహారాల వైపు మళ్లాల్సిన సమయం
- మందుల కంటే ముందు మన ఆహారం మారాలి
- ఆరోగ్య విప్లవానికి గ్రామీణ పండ్లే బాట

ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతోంది. జీవనశైలి మార్పులు, కాలుష్యం, ఒత్తిడి, ఫాస్ట్ ఫుడ్ అలవాట్లు మన ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఒకప్పుడు అరుదుగా కనిపించే మధుమేహం, రక్తపోటు, గుండె సమస్యలు ఇప్పుడు చిన్న వయసులోనే వస్తున్నాయి. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజలు వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కానీ అసలు సమస్య ఏమిటంటే మనం ప్రకృతి నుంచి దూరమవడం. మన పాత ఆహారపు అలవాట్లను మరిచిపోవడం. ఒకప్పుడు ప్రతి ఇంట్లో పండ్లు, ఆకుకూరలు, సహజ ఆహారం ప్రధాన భాగంగా ఉండేవి. గ్రామాల్లో పిల్లలు చెట్ల నుంచి పండ్లు కోసుకుని తినేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్యాకెట్ ఫుడ్స్, చల్లని పానీయాలు, రసాయనాలతో నిండిన ఆహారం మన జీవితాల్లో భాగమయ్యాయి. ఈ మార్పు మన ఆరోగ్యాన్ని నిశ్శబ్దంగా దెబ్బతీస్తోంది. శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోవడంతో రోగనిరోధక శక్తి తగ్గిపోతోంది. ఆరోగ్య నిపుణులు చెబుతున్నదేమిటంటే మందులు తీసుకోవడం కంటే ముందుగా ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. మన చుట్టూ దొరికే సహజ పండ్లలోనే అనేక రోగాలకు నివారణ దాగి ఉంది. జామ, బొప్పాయి, అరటి, ఉసిరి, దానిమ్మ వంటి పండ్లు శరీరానికి కావలసిన విటమిన్లు, ఖనిజాలు అందిస్తాయి. కానీ ప్రస్తుతం ప్రజలు విదేశీ పండ్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. స్థానిక పండ్ల విలువను మరిచిపోతున్నారు. మన పెద్దలు చెప్పిన ఒక మాట ఇప్పుడు నిజమవుతోంది. "ఆహారమే ఔషధం" అనే భావనను మళ్లీ గుర్తు చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. ప్రతి చిన్న సమస్యకు మందులపై ఆధారపడటం ప్రమాదకరం. శరీరానికి సహజంగా రోగనిరోధక శక్తి పెరగాలి. అందుకు సరైన ఆహారం అవసరం. ముఖ్యంగా పిల్లల్లో ఈ అలవాటు పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. ఇప్పుడు చిన్న పిల్లలు కూడా ఊబకాయం, జీర్ణ సమస్యలు, బలహీనత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. కారణం బయట ఆహారం. స్కూల్‌ల దగ్గర దొరికే జంక్ ఫుడ్ పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. పండ్లు తినే అలవాటు తగ్గిపోవడం కూడా ఒక కారణం. ప్రతి రోజు కనీసం ఒక పండు తినే అలవాటు పెంచితే అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. ప్రస్తుతం మార్కెట్‌లో "హెల్త్ డ్రింక్స్" పేరుతో అనేక ఉత్పత్తులు వస్తున్నాయి. వాటిపై ప్రజలు ఎక్కువ డబ్బు ఖర్చు చేస్తున్నారు. కానీ సహజమైన పండ్లు, గింజలు, ధాన్యాలు ఇచ్చే శక్తి వాటిలో ఉండదు. ప్రకృతి ఇచ్చిన ఆహారంలోనే నిజమైన పోషకాలు ఉంటాయి. ఈ విషయాన్ని ప్రజలు మళ్లీ గుర్తించాల్సిన సమయం వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మంది సహజ ఆహారాన్ని తీసుకుంటున్నారు. అందుకే వారి ఆరోగ్యం పట్టణాల్లో ఉన్నవారికంటే మెరుగ్గా కనిపిస్తుంది. ఉదయం నడక, సహజ ఆహారం, శారీరక శ్రమ వంటి అంశాలు ఆరోగ్యాన్ని కాపాడుతున్నాయి. పట్టణాల్లో మాత్రం కూర్చునే జీవితం పెరుగుతోంది. ఇది అనేక వ్యాధులకు కారణమవుతోంది. ప్రభుత్వాలు కూడా ఇప్పుడు పోషకాహారంపై అవగాహన పెంచే కార్యక్రమాలు చేపడుతున్నాయి. స్కూల్‌లలో పిల్లలకు పండ్లు అందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే ఇది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు. ప్రతి కుటుంబం ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి. ఖరీదైన ఆసుపత్రుల కంటే మంచి ఆహారం ఎంతో విలువైనది. ప్రకృతి మనకు ఇచ్చిన సంపదను మనమే నిర్లక్ష్యం చేస్తున్నాం. స్థానిక పండ్లు, కూరగాయలు, సంప్రదాయ ఆహారాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిని వదిలేసి రసాయనాలతో నిండిన ఆహారం వైపు పరుగెత్తడం ప్రమాదకరం. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే మళ్లీ ప్రకృతి వైపు అడుగులు వేయాల్సిందే. ఇప్పటి తరానికి ఆరోగ్యంపై అవగాహన పెరగాలి. సోషల్ మీడియా ప్రభావంతో ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి పెరుగుతోంది. కానీ అదే సమయంలో సహజ ఆహారాల ప్రాముఖ్యతను కూడా ప్రచారం చేయాలి. ఇంట్లో పిల్లలకు పండ్లు తినే అలవాటు పెడితే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తగ్గుతాయి. మొత్తానికి మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. ప్రకృతి ఇచ్చిన పండ్లు, సహజ ఆహారం, మంచి జీవనశైలి ఉంటే అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. మందులపై ఆధారపడే పరిస్థితి రాకముందే ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. అదే నిజమైన ఆరోగ్య విప్లవానికి మొదటి అడుగు.

ఆరోగ్యం కోసం మారుతున్న భారతం

భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. నగరాలు విస్తరిస్తున్నాయి. సాంకేతికత జీవితాన్ని సులభతరం చేస్తోంది. కానీ ఈ మార్పుల మధ్య ఒక పెద్ద సమస్య నెమ్మదిగా పెరుగుతోంది -- - ఆరోగ్య సంక్షోభం. ఒకప్పుడు వృద్ధుల్లో మాత్రమే కనిపించే వ్యాధులు ఇప్పుడు యువతలో కూడా పెరుగుతున్నాయి. మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు సాధారణమైపోతున్నాయి. నగర జీవితం వేగంగా సాగుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఉద్యోగాలు, ట్రాఫిక్, ఒత్తిడి మధ్య ప్రజలు జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గిపోతోంది. ఇంటి ఆహారం కంటే బయట దొరికే ఫాస్ట్ ఫుడ్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. శారీరక శ్రమ లేకుండా గంటల తరబడి కూర్చునే జీవితం శరీరాన్ని బలహీనపరుస్తోంది. ప్రస్తుతం యువతలో జిమ్‌లకు వెళ్లే అలవాటు పెరిగింది. ఇది మంచి విషయం. కానీ అదే సమయంలో సహజ ఆహారం తీసుకోవడం తగ్గిపోతోంది. ప్రోటీన్ పౌడర్లు, సప్లిమెంట్లు, ఎనర్జీ డ్రింక్స్‌పై ఆధారపడటం పెరుగుతోంది. వైద్య నిపుణులు చెబుతున్నదేమిటంటే సహజ ఆహారం ఇచ్చే పోషకాలు ఎలాంటి కృత్రిమ ఉత్పత్తుల్లో ఉండవు. పాత తరాలు తీసుకున్న ఆహారాన్ని పరిశీలిస్తే అందులో ఆరోగ్య రహస్యాలు కనిపిస్తాయి. రాగి సంగటి, జొన్న రొట్టెలు, పెసర పప్పు, పండ్లు, ఆకుకూరలు వంటి ఆహారాలు శరీరానికి బలం ఇచ్చేవి. ఇప్పుడు వాటి స్థానంలో పిజ్జా, బర్గర్లు, శీతల పానీయాలు వచ్చాయి. ఈ మార్పు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పిల్లల్లో కూడా ఇప్పుడు అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. మొబైల్ ఫోన్లు, వీడియో గేమ్స్ కారణంగా బయట ఆడుకునే అలవాటు తగ్గిపోయింది. శారీరక చలనం లేకపోవడం వల్ల ఊబకాయం పెరుగుతోంది. ఇది భవిష్యత్తులో పెద్ద ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. ఆరోగ్య రంగంపై ఖర్చులు కూడా భారీగా పెరుగుతున్నాయి. ఒకప్పుడు చిన్న చికిత్సలకు సరిపడే డబ్బు ఇప్పుడు సాధారణ పరీక్షలకే ఖర్చవుతోంది. దీనికి ప్రధాన కారణం జీవనశైలి మార్పులు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో మళ్లీ సహజ ఆహారాలపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ఆర్గానిక్ ఉత్పత్తులు, మిల్లెట్స్, సహజ పండ్లకు డిమాండ్ పెరుగుతోంది. ఇది మంచి పరిణామం. ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుంటున్నారని దీని ద్వారా తెలుస్తోంది. ప్రభుత్వాలు కూడా ఆరోగ్యకరమైన ఆహారంపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. స్కూల్ పిల్లలకు పోషకాహారం అందించే పథకాలు తీసుకొస్తున్నాయి. అయితే సమాజం మొత్తం కలిసి పనిచేస్తేనే ఆరోగ్యవంతమైన భారతాన్ని నిర్మించగలం. ఇంట్లో పెద్దలు పిల్లలకు మంచి అలవాట్లు నేర్పాలి. పండ్లు తినడం, వ్యాయామం చేయడం, సమయానికి నిద్రపోవడం వంటి అలవాట్లు చిన్నప్పటి నుంచే పెంచాలి. ఆరోగ్యంపై పెట్టే శ్రద్ధే భవిష్యత్తులో కుటుంబాన్ని కాపాడుతుంది. భారతదేశం అభివృద్ధి చెందాలి అంటే ప్రజలు ఆరోగ్యంగా ఉండాలి. ఆరోగ్యవంతమైన యువతే దేశానికి బలం. అందుకే ప్రకృతి దగ్గరకు మళ్లీ వెళ్లాల్సిన అవసరం ఉంది. సహజ ఆహారం, శారీరక శ్రమ, మంచి జీవనశైలి - ఇవే ఆరోగ్య భారతానికి పునాదులు.

రాజస్థాన్ రాయల్స్‌కు భారీ షాక్

- గుజరాత్ టైటాన్స్ వరుసగా నాలుగో విజయం
- రాజస్థాన్‌పై 77 పరుగుల భారీ గెలుపు
- శుభ్‌మన్ గిల్ 84 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్....
- రషీద్ ఖాన్ నాలుగు వికెట్లతో చెలరేగాడు
- 229 పరుగుల భారీ స్కోరు చేసిన గుజరాత్
- పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి గుజరాత్
- ప్లే ఆఫ్స్ దిశగా మరో అడుగు ముందుకేసిన టైటాన్స్

ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసి పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది. శనివారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో రాణించిన గుజరాత్ 77 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (84) రాణించడంతో 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య చేధనలో రాజస్థాన్ 152 పరుగులకే కుప్పకూలింది. రషీద్ ఖాన్ 4 వికెట్లతో రాజస్థాన్ పతనాన్ని శాసించగా, ఈ విజయంతో గుజరాత్ ప్లే ఆఫ్స్ బెర్తుకు చేరువైంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో గుజరాత్ టైటాన్స్ .. వరుసగా నాలుగో విజయాన్ని సాధించింది. దీంతో పాయింట్స్ టేబుల్‌లో ఐదో ప్లేసు నుంచి ఏకంగా రెండో ప్లేసుకు దూసుకెళ్లింది. శనివారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచులో 77 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన గుజరాత్.. రెండు పాయింట్లతో పాటు భారీగా నెట్ రన్ రేట్‌ను సొంతం చేసుకుంది. దీంతో ప్లే ఆఫ్స్ దిశగా మరో అడుగు ముందుకేసింది. తాజా ఫలితంతో రాజస్థాన్ టాప్-4లో ప్లేసు కోల్పోయింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 229/4 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 44 బంతుల్లో 84 రన్స్ చేసి.. సత్తాచాటాడు. సాయి సుదర్శన్ (55), వాషింగ్టన్ సుందర్ (37) సైతం ఫర్వాలేదనిపించారు. రాజస్థాన్ బౌలర్లలో బ్రిజేష్ శర్మ 2, యశ్ రాజ్ పుంజా 1, రవీంద్ర జడేజా 1 వికెట్ తీశారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్.. ఓ దశలో 2.4 ఓవర్లలో 38/0తో నిలిచింది. ఇందులో వైభవ్ సూర్యవంశీ 16 బంతుల్లో 36 రన్స్ చేశాడు. దీంతో అతడు క్రీజులో ఉన్నంత సేపు స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. అయితే స్వల్ప వ్యవధిలో ఓపెనర్ల వికెట్లు కోల్పోయిన రాజస్థాన్ కష్టాల్లో పడింది. కాసేపటికే హిట్‌మెయర్, ధ్రువ్ జురెల్, డోనోవాన్ ఫెర్రీరా కూడా ఔట్ కావడంతో ఆ జట్టు ఓటమి దిశగా సాగింది. చివరకు 16.3 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 77 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. ఇక గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో స్పిన్నర్ రషీద్ ఖాన్.. అద్భుత బౌలింగ్ చేశాడు. 4 ఓవర్లు వేసిన అతడు.. 33 పరుగులు మాత్రమే ఇచ్చి.. 4 వికెట్లు పడగొట్టాడు. జేసన్ హోల్డర్ 3, కగిసో రబాడా 2, మహమ్మద్ సిరాజ్ 1 వికెట్ తీశారు. ఈ విజయంతో గుజరాత్ ప్లే ఆఫ్స్‌కు చేరువైంది. ఆడిన 11 మ్యాచులలో ఏడు విజయాలు, 14 పాయింట్లతో రెండో ప్లేసులో నిలిచింది. అన్నే పాయింట్లు ఉన్నప్పటికీ మెరుగైన రన్ రేట్ ఉన్నందున సన్ రైజర్స్ హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. రియాన్ పరాగ్ గాయం కారణంగా ఈ మ్యాచ్ ఆడలేదు

'టాప్-2లో ఉండేది ఆ జట్లే.. అదే జరిగితే సీఎస్కే కూడా': అశ్విన్

ఐపీఎల్ 2026 ప్లే ఆఫ్స్‌పై అశ్విన్ స్పందన

సన్ రైజర్స్, ఆర్సీబీ టాప్-2లో ఉంటాయని వ్యాఖ్య

కేకేఆర్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు కష్టమేనన్న అశ్విన్

ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో, ప్లే ఆఫ్స్ చేరే జట్లపై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. లీగ్ దశలో మరో 19 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉండగా, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు టాప్-2లో నిలుస్తాయని అశ్విన్ జోస్యం చెప్పాడు. ఇక ఢిల్లీ క్యాపిటల్స్ రేసు నుంచి తప్పుకున్నట్లేనని అభిప్రాయపడిన యాష్.. చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ చేరాలంటే మిగిలిన 4 మ్యాచ్‌ల్లో 3 గెలవాలని విశ్లేషించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో ఇప్పటికే సగానికి పైగా మ్యాచ్‌లు పూర్తయ్యాయి. శుక్రవారం నాటికి లీగ్ స్టేజ్‌లో మరో 19 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. అయితే ఈ సారి గతంతో పోలిస్తే.. ప్లే ఆఫ్స్ రేసు భిన్నంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు ఒక్క జట్టూ కూడా నాకౌట్ బెర్తును ఖరారు చేసుకోకపోవడం గమనార్హం. అయితే పాయింట్స్ టేబుల్‌లో మాత్రం సన్‌రైజర్స్, పంజాబ్, ఆర్సీబీ, రాజస్థాన్, గుజరాత్ టైటాన్స్ ముందు వరుసలో ఉన్నాయి. ఇక బాటమ్‌లో ఉన్న మిగతా జట్లతో పోలిస్తే.. చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ చేరేందుకు కాస్త మెరుగైన అవకాశాలను కలిగి ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించే జట్లను టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంచనా వేశాడు. శుక్రవారం కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో పరాజయం పాలైన ఏడో ఓటమిని మూటగట్టుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ చేరడం కష్టమేనని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. "ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే ఆఫ్స్ చేరుకునేలా కనిపించడం లేదు. కోల్‌కతా నైట్ రైడర్స్ కూడా ఈ రేసులో వెనుకబడిపోతుందని అనిపిస్తోంది. ఒకవేళ కేకేఆర్ అర్హత సాధిస్తే ఆ జట్టును ఆపడం కష్టం. ఎందుకంటే ఈ సీజన్‌లో నైట్‌రైడర్స్ పుంజుకున్న తీరు అద్భుతం. అందుకే కేకేఆర్ ఈ లీగ్‌లో మూడు టైటిళ్లు సాధించింది. లీగ్ దశ ముగిసేసరికి సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టాప్-2లో నిలుస్తాయని అనుకుంటున్నా. గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్‌లలో ఏవైనా రెండు జట్లు 3, 4 స్థానాల్లో నిలిచి ప్లే ఆఫ్స్ చేరతాయి" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. మరోవైపు ప్రస్తుతం పాయింట్స్ టేబుల్‌లో ఆరో ప్లేసులో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్.. ప్లే ఆఫ్స్ చేరాలంటే మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లో మూడు గెలవాలి. లక్నోతో జరగబోయే రెండు మ్యాచ్‌లలో సీఎస్కే విజయం సాధిస్తే వారి పని సులువు అవుతుంది" అని అశ్విన్ విశ్లేషించాడు.

డోప్ టెస్టులకు డుమ్మా..

జైశ్వాల్, షెఫాలీకి నాడా నోటీసులు

డోప్ టెస్టులకు డుమ్మా కొట్టడంపై చర్యలు

గైర్హాజరీపై వివరణ ఇవ్వాలని కోరిన నాడా

భారత యువ క్రికెటర్లు యశస్వి జైశ్వాల్, షెఫాలీ వర్మలకు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (చీూణూ) నోటీసులు జారీ చేసింది. గత ఏడాది నిర్ణీత సమయాల్లో డోప్ పరీక్షలకు అందుబాటులో లేకపోవడంతో వీరిద్దరికీ నోటీసులు ఇచ్చింది. నాడా నిబంధనల ప్రకారం అథ్లెట్లు తమ లొకేషన్ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. అయితే జైశ్వాల్ (డిసెంబర్ 2025), షెఫాలీ (నవంబర్ 2025) పరీక్షలకు హాజరుకాకపోవడంపై వివరణ ఇవ్వాలని నాడా ఆదేశించింది. ఈ విషయాన్ని బీసీసీఐ ధృవీకరిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. టీమిండియా క్రికెటర్లు యశస్వి జైశ్వాల్ , షెఫాలీ వర్మలకు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) నోటీసులు జారీ చేసింది. గతేడాది నిర్ణీత సమయంలో డోప్ పరీక్షలకు హాజరుకాకపోవడంపై ఈమేరకు నోటీసులు ఇచ్చింది. నాడా రిజిస్టర్డ్ టెస్టింగ్ పూల్ (ఆర్టీపీ)లో భాగమైన వీరిద్దరూ.. డోప్ టెస్టుకు ఎందుకు హాజరుకాలేదో కారణాలు చెప్పాలని నాడా నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఇక డోప్ టెస్టులకు గైర్హాజరు కావడంపై వివరణ ఇచ్చుకునేందుకు జైశ్వాల్, షెఫాలీకి అవకాశం కల్పించారు. మరోవైపు ఈ నోటీసుల జారీ గురించి నాడా.. బీసీసీఐ, ఐసీసీకి సమాచారం అందించింది. కాగా షెడ్యూల్ ప్రకారం 2025 డిసెంబర్ 17న యశస్వి జైశ్వాల్‌కు, నవంబర్ 7న షెఫాలి వర్మకు డోప్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే వారు ఈ పరీక్షలు చేయించుకోవడానికి అందుబాటులో లేరు. దీంతో నాడా ఫిబ్రవరిలో వీరిద్దరి నుంచి వివరణ కోరింది. అయినప్పటికీ వీరు స్పందించకపోవడంతో తాజాగా మరోసారి నోటీసులు జారీ చేసింది. డోపింగ్ నిరోధక నిబంధనల ప్రకారం, ఆర్టీపీలోని అథ్లెట్లు తమ లొకేషన్ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండాలి, తద్వారా టెస్టర్లు వారిని ఎప్పుడైనా సంప్రదించే అవకాశం ఉంటుంది. ఒక్కసారి డోప్ టెస్టులకు హాజరు కాకపోవడం డోపింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు రాదు. కానీ 12 నెలల వ్యవధిలో మూడుసార్లు డోపింగ్ టెస్టులకు హాజరుకాకపోతే మాత్రం కఠిన చర్యలకు గురవుతారు. అలాంటి వారిపై రెండేళ్లపాటు నిషేధం కూడా పడే అవకాశం ఉంటుంది. నాడా నుంచి నోటీసులు అందినట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ధృవీకరించింది. ఈ విషయాన్ని పరిశీలిస్తామని తెలిపింది. "అవును, టెస్టులు జరగనట్లు మాకు నాడా నుంచి సమాచారం అందింది. ఇది ఎలా జరిగిందో మేము వారిని అడిగి తెలుసుకుంటాం. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా, రిషబ్ పంత్‌తో సహా 13 మంది భారత క్రికెటర్లు నాడా ఆర్టీపీ జాబితాలో ఉన్నారు. భారత్ నుంచి డోప్ టెస్టు లిస్టులో మొత్తంగా 348 మంది అథ్లెట్లు ఉన్నారు. జైశ్వాల్ ప్రస్తుతం ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్నాడు.

రియాన్ పరాగ్‌కు ఏమైంది

గాయంతో జీటీతో మ్యాచుకు రియాన్ పరాగ్ దూరం

రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ జైశ్వాల్ బాధ్యతలు

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న రాజస్థాన్

ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచులో రాజస్థాన్ రాయల్స్ జట్టు కొత్త సారథి నేతృత్వంలో బరిలోకి దిగింది. రెగ్యులర్ కెప్టెన్ రియాన్ పరాగ్ హ్యామ్‌స్ట్రింగ్ గాయం కారణంగా జట్టుకు దూరం కావడంతో, యువ బ్యాటర్ యశస్వి జైశ్వాల్ తొలిసారి కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న ఈ కీలక పోరులో టాస్ గెలిచిన జైశ్వాల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. ప్లే ఆఫ్స్ రేసులో భాగంగా ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు పాయింట్ల పట్టికలో నేరుగా రెండో స్థానానికి చేరుకునే అవకాశం ఉండటంతో ఈ పోరుపై ఆసక్తి నెలకొంది. రెగ్యులర్ కెప్టెన్ రియాన్ పరాగ్ గాయం కారణంగా దూరం కావడంతో యశస్వి జైశ్వాల్ తన కెరీర్‌లో తొలిసారి రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో అతడు.. టాస్‌కు వచ్చాడు. హ్యామ్‌స్ట్రింగ్ కారణంగా రియాన్ పరాగ్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడని టాస్ సందర్భంగా జైశ్వాల్ చెప్పాడు. ఇక ఐపీఎల్‌లో కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లోనే టాస్ గెలిచిన అతడు.. తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ ప్రభావం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పాడు. తొలిసారి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టడం ఎలా ఉందని వ్యాఖ్యాత అడగగా.. జైశ్వాల్ స్పందించాడు. ఎక్సైటెడ్‌గా ఉందని పేర్కొన్నాడు. మ్యాచ్‌పై ఫోకస్ చేసినట్లు చెప్పాడు. మరోవైపు తాము టాస్ గెలిచినా.. తొలుత బౌలింగ్ ఎంచుకునే వాళ్లమని గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెల్లడించాడు. ఇక ఈ మ్యాచ్ కోసం రెండు జట్లూ కూడా తమ ప్లేయింగ్ లెవెన్‌లో మార్పులు చేశాయి. ప్రస్తుతం పాయింట్స్ టేబుల్‌లో రాజస్థాన్ రాయల్స్ నాలుగో ప్లేసులో, గుజరాత్ టైటాన్స్ ఐదో స్థానంలో ఉన్నాయి. ఇవాళ్టి మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా రెండో ప్లేసులోకి దూసుకెళ్లనుంది. ప్లే ఆఫ్స్‌కు అవకాశాలు గణనీయంగా పెంచుకోనుంది.

తుది జట్లు ఇవే..

రాజస్థాన్ రాయల్స్: యశస్వి జైశ్వాల్ (కెప్టెన్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), షిమ్రాన్ హెట్‌మెయర్, డోనోవాన్ ఫెర్రీరా, రవీంద్ర జడేజా, శుభమ్ దూబె, దసున్ శనక, జోఫ్రా ఆర్చర్, తుషార్ దేశ్‌పాండే, బ్రిజేష్ శర్మ, యశ్ రాజ్ పుంజా

ఇంపాక్ట్ ప్లేయర్లు: వైభవ్ సూర్యవంశీ, ఆడమ్ మిల్నే, రవి సింగ్, సుశాంత్ మిశ్రా, రవి బిష్ణోయ్

గుజరాత్ టైటాన్స్: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, జోస్ బట్లర్ (వికెట్ కీపర్), నిశాంత్ సింధు, వాషింగ్టన్ సుందర్, జేసన్ హోల్డర్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, అర్షద్ ఖాన్, కగిసో రబాడా, మహమ్మద్ సిరాజ్

ఇంపాక్ట్ ప్లేయర్లు: ప్రసిద్ధ్ కృష్ణ, గ్లెన్ ఫిలిప్స్, అనుజ్ రావత్, సాయి కిషోర్, కుమార్ కుశాగ్రా

ఇది కదా న్యూస్ అంటే!

రామ్ చరణ్-జాన్వీ జంటగా 'పెద్ది'

బుచ్చిబాబు సానా స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కింపు

రాంచీలో భారీ ప్రమోషన్ ఈవెంట్ ప్లాన్

ముఖ్య అతిథిగా ఎంఎస్ ధోని వచ్చే అవకాశం

ఏఆర్ రెహమాన్ సంగీతానికి భారీ స్పందన

ఓవర్సీస్ బుకింగ్స్‌లో రికార్డు వసూళ్లు

జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో విడుదల

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ (Mega Power Star Ram Charan), జాన్వీ కపూర్ (జీanhvi Kapoor) జంటగా.. దర్శకుడు బుచ్చిబాబు సానా (Buchi Babu Sana) రూపొందించిన ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది' (Peddi Movie). స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నప్పటికీ, ప్రమోషన్స్ విషయంలో కొంత స్తబ్దత నెలకొందని టాక్ వినిపించింది. అయితే, ఈ లోటును భర్తీ చేస్తూ మేకర్స్ ఇప్పుడు ఒక భారీ ప్లాన్‌తో సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా నార్త్ మార్కెట్‌ను టార్గెట్ చేస్తూ బాలీవుడ్ స్థాయిలో ప్రమోషన్స్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రమోషన్లలో భాగంగా రాంచీలో ఒక భారీ ఈవెంట్‌ను నిర్వహించాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. ఈ వేడుకకు క్రికెట్ దిగ్గజం ఎం.ఎస్. ధోని (మీ ణష్ట్రశీఅఱ)ని ముఖ్య అతిథిగా ఆహ్వానించనున్నారనే వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం చర్చల దశలో ఉన్న ఈ ప్రతిపాదన కనుక ఓకే అయితే, సినిమా క్రేజ్ నెక్స్ట్ లెవల్‌కు వెళ్లడం ఖాయం. కథలో క్రికెట్ బ్యాక్‌డ్రాప్ కూడా ఉండటంతో ధోని రాక సినిమాకు అతిపెద్ద అడ్వాంటేజ్‌గా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. విడుదలైన రెండు సాంగ్స్, 'పెద్ది ఫస్ట్ షాట్' వీడియో సినిమాపై అంచనాలను ఆకాశానికి చేర్చాయి. టెక్నికల్ వేల్యూస్ పరంగా సినిమా చాలా రిచ్‌గా ఉండబోతోందని మేకర్స్ ఇప్పటికే స్పష్టం చేశారు. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, జగపతి బాబు వంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనుండటంతో సినిమాపై ఉన్న హైప్ మరింత పెరిగింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో 'పెద్ది' బాక్సాఫీస్ సునామీ అప్పుడే మొదలైంది. అక్కడ బుకింగ్స్ ప్రారంభించి 30 నిమిషాల్లోనే 50 వేల డాలర్ల గ్రాస్‌ను వసూలు చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. ఈ సెన్సేషనల్ స్టార్ట్ చూస్తుంటే, ప్రీమియర్ షోల సమయానికి సినిమా వసూళ్లు అంచనాలకు మించి ఉంటాయని డిస్ట్రిబ్యూటర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓవర్సీస్‌లో రామ్ చరణ్‌కు ఉన్న క్రేజ్‌కి ఇది అద్దం పడుతోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రం జూన్ 4న పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇక ఈ సినిమా సుమారు 3 గంటల రన్ టైంతో రానున్నట్లు తెలుస్తోంది. మరి ఫైనల్ కట్‌లో కూడా ఇదే నిడివి ఉంటుందా లేదా అనేది వేచి చూడాలి. ఎమోషన్స్, స్పోర్ట్స్ ఎలిమెంట్స్ పుష్కలంగా ఉన్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తుందో చూడాలని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

వీడీ, డైరెక్టర్ శౌర్యువ్ కాంబో

ఫిల్మ్ స్పెషల్ పోస్టర్ వైరల్!

రౌడీ హీరో విజయ్ దేవరకొండ బర్త్‌డే స్పెషల్‌గా ఆయన నటిస్తోన్న సినిమా అప్డేట్స్ ఒక్కొక్కటిగా విడుదలయ్యాయి. 'రౌడీ జనార్ధన', 'రణబాలి' నుంచి వచ్చిన పోస్టర్స్ ఇప్పటికే వైరల్ అవుతుండగా.. తాజాగా మరో మూవీ నుంచి కూడా ఓ స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ వదిలారు. రౌడీ హీరో విజయ్ దేవరకొండ (ఎఱయిఎ ణవజవతీఖిఎశీఅఱ) బర్త్‌డే స్పెషల్‌గా ఆయన నటిస్తోన్న సినిమా అప్డేట్స్ ఒక్కొక్కటిగా విడుదలయ్యాయి. 'రౌడీ జనార్ధన', 'రణబాలి' నుంచి వచ్చిన పోస్టర్స్ ఇప్పటికే వైరల్ అవుతుండగా.. తాజాగా మరో మూవీ నుంచి కూడా ఓ స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ వదిలారు. విజయ్ దేవరకొండ హీరోగా వైరా క్రియేషన్స్ బ్యానర్‌పై శౌర్యువ్ (ఞష్ట్రశీబతీఎబజ) దర్శకత్వంలో ప్రొడ్యూసర్ ప్రదీప్ ఉప్పలపాటి నిర్మిస్తోన్న చిత్రం నుంచి ఓ పవర్ ఫుల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ హ్యూజ్ గ్లోబల్ ప్రాజెక్ట్ ఇటీవలే ఘనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. టాప్ ఇంటర్నేషల్ టెక్నీషియన్స్ ఈ మూవీకి వర్క్ చేస్తుండటం విశేషం. విజయ్ దేవరకొండ పుట్టినరోజు శుభాకాంక్షలు (ఎదీణ ఎఱయిఎ ణవజవతీఖిఎశీఅఱ) తెలియజేస్తూ వదిలిన ఈ పోస్టర్ ఆసక్తికరంగా ఉండటమే కాకుండా.. సినిమాపై భారీగా అంచనాలను పెంచేస్తోంది. మరీ ముఖ్యంగా.. 'ప్రపంచం వ్యతిరేకించినా, విధి అతన్ని రాజును చేసింది..' అని, పోస్టర్ పై ఉన్న క్యాప్షన్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. చేతిలో ఖడ్గంతో సింహాసనంపై కూర్చుని ఉన్న విజయ్ స్టిల్‌తో ఈ పోస్టర్‌ను డిజైన్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్టర్‌ని ఫ్యాన్స్ విపరీతంగా వైరల్ చేస్తున్నారు. మా హీరోకి వరస బ్లాక్‌బస్టర్స్ పడబోతున్నాయంటూ సంబరాలు చేసుకుంటున్నారు. ఇక ఈ సినిమాకు 'హౌస్ ఆఫ్ ది డ్రాగన్, ఫాల్ ఔట్' వంటి హాలీవుడ్ చిత్రాలకు పనిచేసిన అలెజాంద్రో మార్టినెజ్ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'గాడ్స్ ఆఫ్ ఈజిప్ట్, బ్యాట్ మ్యాన్ ఫరెవర్, స్పోపియర్సర్' చిత్రాల విఎఫ్ఎక్స్ సూపర్ వైజర్ ఎరిక్ డస్ట్ ఈ మూవీకి పనిచేస్తున్నారు. ఇలా టాలెంటెడ్ టెక్నీషియన్స్ ఈ సినిమాకు పని చేస్తున్నట్లుగా మేకర్స్ ఇప్పటికే ప్రకటించి ఉన్నారు. మైథాలజికల్ యూనివర్స్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందనున్న ఈ సినిమా.. ప్రేక్షకులకు ఒక కొత్త ప్రపంచాన్ని చూపించనుందని చిత్రబృందం చెబుతోంది.

ఆ దర్శకుడితో సినిమా ఆగిపోయినట్టేనా

'తమ్ముడు' ఫ్లాప్‌తో నితిన్ కాస్త స్లో

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో కొత్త సినిమా

అంజి కె. మణిపుత్ర కథకు నితిన్ ఓకే

వి.ఐ ఆనంద్ సినిమా బడ్జెట్‌తో ఇబ్బందులు

సెకండాఫ్‌పై టీమ్‌కు కొన్ని సందేహాలు

కథ మార్పులకు దర్శకుడు ఒప్పుకోలేదట

వి.ఐ ఆనంద్ మరో హీరోతో ముందుకు వెళ్లొచ్చు

'తమ్ముడు' సినిమా పరాజయంతో నితిన్ (అఱ్ష్ట్రఱఱఱ) కాస్త స్లో అయ్యారు. గత చిత్రం విడుదలై ఏడాది కావొస్తుస్తోంది. సితారా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో ఓ సినిమాకు పచ్చజెండా ఊపారు. 'తమ్ముడు' సినిమా పరాజయంతో నితిన్ (అఱ్ష్ట్రఱఱఱ) కాస్త స్లో అయ్యారు. గత చిత్రం విడుదలై ఏడాది కావొస్తుస్తోంది. సితారా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో ఓ సినిమాకు పచ్చజెండా ఊపారు. ఆయ్ సినిమా ఫేం అంజి కె. మణిపుత్ర చెప్పిన కథ నచ్చడంతో దానికీ ఓకే చేశారు. ఈ రెండు సినిమాలు పార్లల్ ముందుకు తీసుకెళ్లాలనుకుంటున్నారు నితిన్. తన చిత్రాన్ని ఈ ఏడాదిలోనే విడుదల చేయాలనుకుంటున్నారట నాగవంశీ. ఈ రెండు సినిమాల కంటే ముందు విఐ ఆనంద్ (ఎ×ూఱఖుఅఽ) చెప్పిన సినిమా ఓకే చేశారు నితిన్. ఆ చిత్రం ఎప్పుడు విడుదలవుతుందా అని ఎదురుచూశారు అభిమానులు. అయితే అనుకోకుండా ఆ సినిమా కథ కన్నా వెనుక విన్న కథలు ఓకే అయిపోయాయి. దాంతో అసలు వి.ఐ ఆనంద్‌తో సినిమా ఉంటుందా? ఉండదా అన్న చర్చ మొదలైంది. అయితే విఐ ఆనంద్ కథ నితిన్ నచ్చింది.. కానీ బడ్జెట్ కాస్త ఎక్కువే. అదే ఇప్పుడు సమస్య అని సమాచారం. వరుస ఫ్లాపులతో సతమతమవుతున్న నితిన్‌కు మార్కెట్ కాస్త డల్ అయినట్లే. దాంతో భారీ బడ్జెట్ పెట్టాలంటే నిర్మాతలు కాస్త వెనకడుగు వేయడం సహజం. ఖర్చు తగ్గేలా కొన్ని మార్పులు సూచించినట్లు తెలిసింది. అలాగే సెకెండాఫ్‌లో కొన్ని సందేహాలు వ్యక్తమయ్యాయని, అందుకే కథతో చిన్న మార్పులు చేయాలని టీమ్ భావించిందట. అయితే ఆ మార్పులకు దర్శకుడు అంగీకరించలేదని, దాంతో ఈ ప్రాజెక్ట్ తాత్కాలికంగా పక్కకు వెళ్లిపోయిందని టాక్ నడుస్తోంది. అదే సమయంలో సితార బ్యానర్‌లో సినిమా ఓకే కావడంతో నితిన్ ఆ సినిమాతో బిజీ అయ్యారు. అయితే ఆ కథను వి.ఐ ఆనంద్ మరో హీరోకి కథ చెబుతున్నారని తెలిసింది. తను అనుకున్న బడ్జెట్ పెట్టే నిర్మాత కుదిరితే ఈ సినిమా ప్రారంభమయ్యే అవకాశం ఉందట. ఈ క్రేజీ కాంబినేషన్ సెట్ అవుతుందా లేదా, వీఐ ఆనంద్ మరో హీరోతో ముందుకు వెళ్తాడా? అన్నది త్వరలోనే క్లారిటీ రానుంది.

40 ఏళ్ల చరిత్రకు ముగింపు

పలికిన రాఘవ థియేటర్

ఎన్టీఆర్ సినిమాతో మొదలైన

థియేటర్ ప్రయాణం

జూనియర్ ఎన్టీఆర్ 'దేవర'తో ముగిసిన ప్రస్థానం

చిత్తూరులో మరో సింగిల్ స్క్రీన్ థియేటర్ మూత

ఒకప్పుడు పండుగలా మారిన ఫ్యాన్స్ సందడి

ఎన్నో హిట్ సినిమాలకు వేదికైన రాఘవ థియేటర్

థియేటర్ల మనుగడపై మళ్లీ మొదలైన చర్చలు

భావోద్వేగంలో ఫ్యాన్స్!

కాలానుగుణంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సినీ రంగంలో మారుతున్న పరిస్థితుల కారణంగా సినిమా థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కొత్త థియేటర్లు ఏర్పాటు లేకపోగా.. ఉన్న థియేటర్లు ఒక్కొక్కటిగా మూతబడుతూ వస్తున్నాయి. మారుతున్న పరిస్థితుల కారణంగా సినిమా థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. కొత్త థియేటర్లు ఏర్పాటు లేకపోగా.. ఉన్న థియేటర్లు ఒక్కొక్కటిగా మూతబడుతూ వస్తున్నాయి. రాబోయే కొద్ది రోజుల్లో పూర్తి స్థాయిలో థియేటర్లు మూతపడినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ఈ క్రమంలో జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో ఒకప్పుడు మొత్తం 14 సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉండేవి. అందులో, ఇప్పటికే 8 థియేటర్లు మూతపడ్డాయి. తాజాగా ఇప్పుడు రాఘవ థియేటర్ (ఞష్ట్రష్ట్రఖుఖ ఽష్ట్రవఖ్వతీ) మూతపడింది. చిత్తూరు నగరంలో రాఘవ థియేటర్‌కు ఓ ప్రత్యేకత ఉంది. చిత్తూరు (జష్ట్రఱ్శీశీతీ) నగరంలోని మిట్టూరు ప్రాంతంలో రాఘవ థియేటర్ ఏర్పాటైంది. బంగారుపాలెం మండలం, నలగాంపల్లి గ్రామంలోని ఎన్‌పి కుటుంబానికి చెందిన వీర రాఘవులు నాయుడు జ్ఞాపకార్థం ఆయన పేరుపై థియేటర్‌ను నిర్మించారు. ఆయన రాజకీయ, ఆర్థిక, సామాజిక సేవారంగాల్లో ఎన్నో పేరు ప్రఖ్యాతలు గడించారు. వీర రాఘవులు నాయుడు మరణానంతరం.. టీడీపీ ఆవిర్భావం తర్వాత చిత్తూరు నుంచి ఆయన సతీమణి ఎన్.పి. ఝాన్సీ లక్ష్మి ఎమ్మెల్యేగానూ, ఎంపీగానూ పని చేశారు. 1988లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు (మీ ఞఖ ఞశీ) నటించిన 'శ్రీకృష్ణ పాండవీయం' సినిమాతో మొదలైన థియేటర్.. 40 ఏళ్ల చరిత్రలో ఎన్నో రికార్డులు సొంతం చేసుకుంది. రాఘవ థియేటర్ చిత్తూరుకు ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిందని చెప్పాలి. 40 ఏళ్ల పాటు వినోదాన్ని అందించిన ఈ థియేటర్ ఇప్పుడు శాశ్వతంగా మూతబడి కనుమరుగు కావడాన్ని ప్రేక్షకులే కాదు.. యాజమాన్యం సైతం జీర్ణించుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ థియేటర్ దగ్గర పెద్ద హీరోల సినిమాల రిలీజ్ రోజున ఫ్యాన్స్ సందడి పండుగ వాతావరణాన్ని తలపించేది. ఎన్నో సినిమాలు 100, 200, 300 రోజులు ఆడి రికార్డులు సృష్టించిన సందర్భాలు ఉన్నాయి. 'శుభలగ్నం, పోకిరి, పెళ్లి చేసుకుందాం, సీతారామయ్యగారి మనవరాలు, అన్నమయ్య, హలో బ్రదర్' వంటి అనేక సినిమాలు ఎక్కువ రోజులు ప్రదర్శించబడి రికార్డులు సృష్టించాయి. పాత తరం నుంచి నేటి తరం వరకు ఈ థియేటర్‌తో ఎందరికో మధుర జ్ఞాపకాలు ఉన్నాయి. కొత్త సినిమాలు లేక ప్రేక్షకుల ఆదరణ కరువై థియేటర్లను నడపలేని దు:స్థితికి చేరడంతో థియేటర్లను మూసేసే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే ఇప్పటికే చిత్తూరు నగరంలోని ప్రతాప్, ప్రేమల, లక్ష్మీ, జ్యోతి, దేవి, శ్రీనివాస, మాలిక్, ఆనంద.. వంటి థియేటర్లు వరసగా ఒక్కొక్కటిగా మూతపడుతూ వచ్చాయి. తాజాగా ఇప్పుడు రాఘవ థియేటర్ మూతపడింది. ఈ థియేటర్ యాదృచ్ఛికం ఏంటంటే.. ఎన్.టి. రామారావు సినిమాతో మొదలై.. మూతపడే నాటికి ఆయన మనవడు జూనియర్ ఎన్టీఆర్ (జీతీ చీ=) నటించిన 'దేవర' (ణవఖుతీఖి) సినిమా తర్వాత మూతపడటం. మూతపడ్డ థియేటర్లను యాజమాన్యాలు ప్రత్యామ్నాయాల వైపు మలుచుకుంటున్నారు. అయితే సినిమా రంగంలోని పెద్దలు మరో మారు పునరాలోచించి ప్రేక్షకులకు అందుబాటులో ఉండే విధంగా సినిమాలు తీసి, థియేటర్లను బతికిస్తే గానీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి ఉండదంటూ మూతపడ్డ థియేటర్ల యాజమాన్యాలు అభిప్రాయపడుతున్నాయి.

PRINTED, PUBLISHED, OWNED BY ILIPILLA MOHAN, D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, PRINTED AT GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001 P.H: 92950 03377,EMAIL: ushasri2025@gmail.com,RNI NO: APTEL/25/A4894,EDITOR: ILLIPILLA MOHAN